బలగం TV

BALAGAM

నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ గురువారం-8, అక్టోబర్ - 2026

balagamtv100@gmail.com

పేజీలు-8

ప్రీ-లాంచ్ పేరుతో రూ.500 కోట్ల మోసం!



వివరాలు 2లో..

రైతన్న అరచేతిలో పరిష్కారం



- కిసాన్ హెల్ప్లైన్ సెంటర్ ఏర్పాటు
- మొబైల్ ఫో న్ ద్వారా సేవలకు మరో ముందడుగు

వివరాలు 2లో..

తెలంగాణలో పెరిగిన విద్యుత్ డిమాండ్

- చరిత్రలోనే అత్యధిక స్థాయికి చేరువ
- 19,892 మెగావాట్లకు చేరిన డిమాండ్
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి



హైదరాబాద్, అక్టోబర్ 07 : తెలంగాణలో విద్యుత్ డిమాండ్ చరిత్రలోనే అత్యధిక స్థాయికి చేరుకుంది. రాష్ట్రంలో గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 19,892 మెగావాట్లకు చేరినట్లు ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. దాదాపు 20 వేల మెగావాట్లకు చేరువైన డిమాండ్ ఉన్నప్పటికీ.. రాష్ట్రంలో విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగించామని చెప్పారు. ప్రజా భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. తెలంగాణలో విద్యుత్ డిమాండ్ పొరుగు రాష్ట్రాలతో పోలిస్తే గణనీయంగా పెరిగిందన్నారు. కర్ణాటకలో గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 15 వేల మెగావాట్లలోపే ఉండగా.. ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 13 వేల మెగావాట్లుగా ఉందని తెలిపారు. ఈ రాష్ట్రాల కంటే తెలంగాణలో విద్యుత్ వినియోగ డిమాండ్ ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. రికార్డు స్థాయిలో విద్యుత్ డిమాండ్ నమోదైనప్పటికీ.. వినియోగదారులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయడంలో కీలకపాత్ర పోషించిన విద్యుత్ సంస్థల సిబ్బందిని భట్టి విక్రమార్క అభినందించారు. తెలంగాణ స్టేట్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ , ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ , విద్యుత్ పంపిణీ సంస్థలు అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేయడం వల్లే ఈ స్థాయిలో డిమాండ్ ఉన్నప్పటికీ సరఫరాను కొనసాగించగలిగామని తెలిపారు. ఇదే సమయంలో రాష్ట్ర విద్యుత్ రంగంపై కొందరు నాయకులు తప్పుడు

మిగతా 3లో..

రెపో రేటు 5.50 శాతానికి పెంపు

- 25 బేసిస్ పాయింట్లు పెంచిన ఆర్‌బీఐ
- ఆగస్టులో ద్రవ్యోల్బణం 4.82 శాతానికి చేరిక
- ద్రవ్య విధాన కమిటీ సమావేశంలో నిర్ణయం
- ద్రవ్యోల్బణం భారీగా పెరిగే అవకాశం!!
- 'జంబో హైక్' వైపు మొగ్గు చూపవచ్చు
- ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడి
- ఒకేసారి కఠిన చర్యలు తీసుకోవడం తప్పదు
- ఎస్‌బీఐ అడ్వైజర్ డాక్టర్ సౌమ్య కాంతి ఘోష్



న్యూఢిల్లీ, అక్టోబర్ 07 : ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక పరిస్థితులు సవాళ్లుగా మారుతున్న వేళ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక నిర్ణయం తీసుకుంది. రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచింది. దీంతో రెపో రేటు 5.50 శాతానికి చేరింది. ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలో మూడు రోజుల పాటు జరిగిన ద్రవ్య విధాన కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. రెపో రేటుతో పాటు స్టాండింగ్ డిపాజిట్ ఫెసిలిటీ రేటు 5.25 శాతానికి, మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ, బ్యాంక్ రేటు 5.75 శాతానికి చేరాయి.ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణం భారీగా పెరిగే అవకాశం ఉందని మల్హోత్రా తెలిపారు. దీంతో పలు ప్రధాన దేశాల కేంద్ర బ్యాంకులు ద్రవ్య విధానాన్ని కఠినతరం చేసే పరిస్థితి ఏర్పడిందన్నారు. భారత్‌లోనూ ద్రవ్యోల్బణం పెరుగుతోంది. ఆగస్టులో వినియోగదారుల ధరల సూచీ ఆధారిత

మిగతా 3లో..

యాసంగిలో వరి బదులు ఆరుతడి పంటలే మేలు




- భూగర్భ జలాలను బట్టే పంట ఎంపిక
- వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ సూచన
- వ్యవసాయ అనుబంధ శాఖల జిల్లా అధికారులతో సమీక్ష
- విత్తనాలు, ఎరువుల సరఫరాపై పలు సూచనలు

వివరాలు 2లో..

ఈజీ మనీ ఆఫర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- హెచ్చరించిన తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో
- సైబర్ మోసాలు చేస్తున్న 101 మంది అరెస్ట్



హైదరాబాద్, అక్టోబర్ 07 : ఒక్క బ్యాంక్ అకౌంట్ ఇస్తే డబ్బులు వస్తాయి.. కమీషన్ తీసుకోండి.. ఈజీ మనీ! సోషల్ మీడియా, మెసేజింగ్ యాప్స్‌లో ఇలాంటి మెసేజ్‌లు చూసి చాలామంది పెద్దగా పట్టించుకోరు. కానీ ఇలాంటి చిన్న ఆఫర్లే చివరకు భారీ సైబర్ క్రైమ్ నెట్‌వర్క్‌లో భాగం చేసే ప్రమాదం ఉంది. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో నిర్వహించిన భారీ మల్టీ-స్టేట్ ఆపరేషన్ ఇప్పుడు ఇదే విషయాన్ని బయటపెట్టింది. ఆరు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఏకకాలంలో జరిగిన ఈ ఆపరేషన్‌లో 18 మంది మహిళలు సహా 101 మంది నిందితులు అరెస్టయ్యారు. వీరి ద్వారా సుమారు 17 కోట్ల మోసపూరిత లావాదేవీలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. సెప్టెంబర్ 23 నుంచి రెండు వారాల పాటు కేరళ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ, పుదుచ్చేరిలో ఈ ఆపరేషన్ కొనసాగింది. అసలు ఈ నెట్‌వర్క్‌లో ముఖ్యమైన పాత్ర పోషించింది మ్యూల్ బ్యాంక్ అకౌంట్స్. అంటే.. సైబర్ మోసగాళ్లు తమ పేర్లపై కాకుండా ఇతరుల బ్యాంక్ ఖాతాలను డబ్బులు స్వీకరించడానికి, ట్రాన్స్‌ఫర్ చేయడానికి ఉపయోగించుకోవడం. ఇందుకోసం కొందరు ఏజెంట్లు కమీషన్ తీసుకుని బ్యాంక్ ఖాతాలను సైబర్ నేరగాళ్లకు సమకూర్చినట్లు దర్యాప్తులో తేలింది. అరెస్టయిన 101 మందిలో 19 మంది ఏజెంట్లు, 81 మంది మ్యూల్ అకౌంట్ హోల్డర్లు ఉన్నారు. అంటే నా అకౌంట్ మాత్రమే కదా.. నేను ఏం చేశాను? అనే నిర్లక్ష్యం ఎంత ప్రమాదకరమో ఈ కేసు చెబుతోంది. అంతేకాదు.. ఈ నిందితుల బ్యాక్‌గ్రౌండ్ చూస్తే సైబర్ క్రైమ్ అంటే కేవలం చదువు లేని వాళ్లు లేదా నిరుద్యోగులే చేస్తారనే అపోహ కూడా తప్పని అర్థమవుతోంది. అరెస్టయిన వారిలో వ్యాపారులు, ప్రైవేట్ ఉద్యోగులు, గృహిణులు, డ్రైవర్లు, సేల్స్-మార్కెటింగ్ ఉద్యోగులు ఉన్నారు. ఒక టాటా క్యాపిటల్ ఉద్యోగి కమీషన్ కోసం

మిగతా 3లో..

యూపీలో ఘోర రోడ్డు ప్రమాదం



ముగ్గురు టెన్నిస్ క్రీడాకారులు మృతి

పూర్వాంచల్, అక్టోబర్ 07 : ఉత్తరప్రదేశ్‌లోని పూర్వాంచల్ ఎక్స్‌ప్రెస్‌వేపై బుధవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. రహదారిపై ఆగి ఉన్న ఒక ట్రక్కును కారు వెనుక నుంచి అతివేగంగా ఢీకొన్న ఘటనలో ముగ్గురు యువకులు అక్కడి కక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయ పడ్డారు. మృతులు, గాయపడిన వారందరినీ టెన్నిస్ క్రీడాకారులుగా పోలీసులు గుర్తించారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం, అయోధ్య పరిధిలోని 97.500 మైలురాయి వద్ద బుధవారం వేకువ జామున ఈ ప్రమాదం చోటుచేసుకుంది. లక్నోలో నిర్వహించిన ఒక టెన్నిస్ ఈవెంట్‌లో పాల్గొన్న ఆరుగురు యువకులు తిరిగి దేవరి యాకు కారులో బయలుదేరారు. మార్గమధ్యంలో ఈ దుర్ఘటన జరి గింది. ప్రమాదం ధాటికి కారు ముందుభాగం పూర్తిగా నుజ్జునుజ్జు యింది. వాహనంలో చిక్కుకున్న వారిని

యూపీ పీసీసీ అధ్యక్షురాలిగా ఆరాధన మిశ్రా



ఉత్తరప్రదేశ్, అక్టోబర్ 07 : ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టు కుని కాంగ్రెస్ పార్టీ కీలక మార్పులు చేపట్టింది. రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడిగా అజయ్ రాయ్ స్థానంలో బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన ఆరాధన మిశ్రా మోనాను అధిష్ఠానం నియ మించింది. రాష్ట్రంలో చేజారిన బ్రాహ్మణ ఓటు బ్యాంకును తిరిగి దక్కించుకోవడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టమవు తోంది. అయితే, దశాబ్దం క్రితం విఫలమైన పాత వ్యూహాన్నే కాంగ్రెస్ పునరావృతం చేస్తోందన్న విశ్లేషణలు రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. గతంలో 2017 యూపీ అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ

మిగతా 3లో..

పెట్టుబడులను ఆకర్షించేందుకు చర్యలు

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు
- సమన్వయంతో సమర్థవంతంగా చేపట్టాలి
- ఇన్వెస్ట్ తెలంగాణ తొలి గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం



హైదరాబాద్, అక్టోబర్ 07 :రాష్ట్రంలో పెట్టుబడులను మరింతగా ఆకర్షించడం, పారిశ్రామికాభివృద్ధిని వేగవం తం చేయడం, తెలంగాణను దేశంలోనే అత్యుత్తమ పెట్టు బడి గమ్యస్థానంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఇన్వెస్ట్ తెలంగాణ గవర్నింగ్ కౌన్సిల్ తొలి సమావేశం బుధవారం డా.బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివా లయంలో జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సం జయ్ జాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.రాష్ట్రంలో పెట్టుబ డులకు అనుకూలమైన వాతావరణాన్ని మరింత బలోపేతం చేయడం, పారిశ్రామి కవేత్తలకు వేగవంతమైన అనుమతులు, మౌలిక వసతులు, అవసరమైన ప్రభుత్వ సహకారం అందించడం తదితర అంశాలపై సమావే శంలో సమీక్షించారు.తెలంగాణలో పెట్టుబడుల అవకాశా లను దేశీయ, అంతర్జాతీయ స్థాయిలో విస్తృతంగా ప్రచా రం చేయడంతో పాటు, ఇప్పటికే పెట్టుబడులు పెట్టిన సంస్థలతో నిరంతరం సమన్వయం కొనసాగించాలని సీఎస్ అధికారులను

మిగతా 3లో..

యువత నైపుణ్యమే తెలంగాణకు బలం

- ప్రపంచ సంస్థలకు హైదరాబాద్ గమ్యస్థానం
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



హైదరాబాద్, అక్టోబర్ 07 : తెలంగాణకు ఉన్న అతిపెద్ద బలం యువతలోని నైపుణ్యం, ప్రతిభ, ప్రపంచ స్థాయి పోటీతత్వమేనని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ఈ ప్రతిభ కారణంగానే హైదరా బాద్ సాంకేతిక, ఆవిష్కరణ, ఆర్థిక సేవలు, గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లకు (జీసీసీ) దేశం లోనే ప్రముఖ గమ్యస్థానంగా ఎదుగుతోందని వెల్లడించారు. జూబ్లీహిల్స్‌లో బుధవారం నాడు జరిగిన డిఇ షా షా ఇండియా 30వ వార్షి కోత్సవ వేడుకల్లో మంత్రి శ్రీధర్‌బాబు పాల్గొని ప్రసంగించారు. హైదరాబాద్‌లో డీఈ షా మూడు దశాబ్దాల ప్రస్థానం నగరంపై, తెలం గాణలోని ప్రతిభావంతులైన మానవ వనరులపై ఆ సంస్థకు ఉన్న దీర్ఘకాలిక విశ్వాసానికి నిదర్శనమని అన్నారు. ఈ సందర్భంగా డిఇ షా గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్లు ఎడ్డీ ఫిష్‌మన్, అనూప్ ప్రసాద్, నీల్ కాట్జ్‌కు మంత్రి అభి నందనలు తెలిపారు. సంస్థ ఇండియా మేనే జింగ్ డైరెక్టర్లు చైతన్య గొర్రెపాటి, లక్ష్మీ ప్రసాద్ కోనేటితో పాటు సంస్థలోని మొత్తం బృందానికి శుభాకాంక్షలు చెప్పారు. హైదరాబాద్ సామ ర్థ్యాన్ని తొలినాళ్లలోనే గుర్తించిన ప్రపంచస్థాయి ఆర్థిక, సాంకేతిక సంస్థల్లో డిఇ షా ఒకటని శ్రీధర్‌బాబు అన్నారు. 1996లో హైదరా బాద్‌లో తొలి భారత కార్యాలయాన్ని ఏర్పాటు చేసిం దని గుర్తుచేశారు. "సుమారు 20 మందితో ప్రారంభమైన డిఇ షా ఇండియా ప్రస్థానం ఇవ్వాళ హైదరాబాద్, బెంగళూరు, గురుగ్రామ్ లలో 2,000 మందికి పైగా ఉద్యోగులతో విస్తరించింది. సాంకేతికత, ఆర్థిక పరిశోధన, ఫైనాన్షియల్ ఆపరేషన్స్, కార్పొరేట్ విభాగా ల్లోని సంస్థ బృందాలు ప్రపంచవ్యాప్తంగా సేవలందిస్తున్నాయి" అని మంత్రి తెలిపారు. మూడు దశాబ్దాలుగా డీఈ షా సాధించిన వృద్ధి హైదరాబాద్ ఎదుగుదలతో ముడిపడి ఉందన్నారు. నగరం ఇప్పుడు ప్రపంచస్థాయి సాంకేతిక, ఆర్థిక సేవల సంస్థలకు కేంద్రంగా మారిందని చెప్పారు. "హైదరాబాద్ గత మూడు దశాబ్దాల్లో ఎంతో మారింది. సాంకేతికత, ఆవిష్కరణలు, ఆర్థిక సేవలు, గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లకు దేశంలోనే ప్రముఖ కేంద్రంగా ఎదిగింది.

రసాయన శాస్త్రంలో హెన్రీ కాగన్, కెన్సో సోయికి నోబెల్



రసాయన శాస్త్రంలో హెన్రీ కాగన్, కెన్సో సోయికి నోబెల్

న్యూఢిల్లీ, అక్టోబర్ 07 : వైద్యశాస్త్రంలో చేసిన సేవలకుగానూ 2026 సంవత్సరానికి నోబెల్ బహుమతి ముగ్గురు శాస్త్రవేత్తలను వరించింది. సైంటిస్టులు కార్ల్ డిస్సెరోత్, పీటర్ హెగెమాన్, జార్జ్ నాగెల్‌లకు అత్యున్నత పురస్కారం నోబెల్ లభించింది. కాంతి- నియంత్రిత అయాన్ ఛానెల్స్, ఆప్టోజెనెటిక్స్ పై వారి ఆవిష్కరణలకు ఈ అవార్డు అందుకుంటున్నారు. సజీవ మెదడులోని నాడుల కణాలు (న్యూరాన్లు) మన జ్ఞాపకాలను, భావోద్వేగాలను, ప్రవర్తనను ఎలా ప్రభావితం చేస్తాయో చూపించడం వీరు చేసిన ప్రయోగం ద్వారా

మిగతా 3లో..

పోరాటం ఆపేది లేదు

- బీజేపీని దేశ ప్రజలు క్షమించరు..
- మోదీ, అమిత్ షా నిరంకుశత్వం
- ప్రజాస్వామ్యయుత ఆందోళనకు అడ్డు
- సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌తో వైదొలగాలి
- ప్రధాని మోదీ రాజీనామా చేయించాలి
- ఢిల్లీ పోలీసులపై సీఎం రేవంత్ ఆగ్రహం



న్యూఢిల్లీ, అక్టోబర్ 07 : దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడే వరకు తమ పోరాటం ఆగదని తెలంగాణ ముఖ్యమంత్రి ఎను ముల రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఢిల్లీలో ప్రజాస్వా మ్యబద్ధం గా నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సహా ఇండియా కూటమి ముఖ్య నాయ కులను ఢిల్లీ పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకో వడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బారాఖంబ పోలీస్ స్టేషన్‌లో ఉన్న రాహుల్ గాంధీని కలిసేందుకు వెళ్లిన తనను కూడా పోలీసులు అడ్డుకోవడానికి ప్రయత్నించడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పోలీసు వ్యవస్థను అడ్డం పెట్టుకుని ప్రతిపక్షాల గొంతు నొక్కాలని చూస్తోందని ఆరోపించారు.

మిగతా 2లో..

28న" జర్నలిస్టుల"ఛలో ఢిల్లీ"

- జంతర్ మంతర్ లో ఒక రోజు నిరసన

హైదరాబాద్, అక్టోబర్ 07: ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఐఎఫ్ డబ్ల్యూజే) వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం "జర్నలిస్టుల రక్షణ చట్టం"అమలు చేయాలనే డిమాండ్ తో ఈ నెల 28వ తేదీన "ఛలో ఢిల్లీ" కార్యక్రమం చేపడుతున్నట్లు ఐఎఫ్ డబ్ల్యూజే వర్కింగ్ కమిటీ సభ్యులు, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ లు తెలిపారు.కేంద్ర ప్రభుత్వం పరిధిలోని జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ఆ రోజు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే వందలాది మంది జర్నలిస్టులతో ఢిల్లీలోని జంతర్ మంతర్ లో ధర్నా జరుగు తుందని వారు తెలిపారు.ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు, జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో తరలివెళతారని తెలిపారు. దేశవ్యాప్తంగా జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు, హత్యలను అరికట్టి రక్షణ కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ లో ప్రత్యేక చట్టం చేయాలన్న ఐఎఫ్ డబ్ల్యూజే దీర్ఘకాలిక డిమాండ్ ను వెంటనే పరిష్కరించాలని వారు కోరారు. అదేవిధంగా సీనియర్ జర్నలిస్టుల కోసం జాతీయ పెన్షన్ విధానం ప్రవేశపెట్టాలని, జాతీయ మీడియా కమీషన్ ఏర్పాటు చేయాలని, జర్నలిస్టులకు రైల్వే రాయితీ పాస్ లను పునరుద్దరించాలని డిమాండ్ చేశారు. దీర్ఘ కాలిక ఈ డిమాండ్ల సాధనకై 28న తలపెట్టిన "ఛలో ఢిల్లీ" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

రైతన్న అరచేతిలో పరిష్కారం

కిసాన్ హెల్ప్లైన్ సెంటర్ ఏర్పాటు

మొబైల్ ఫో న్ ద్వారా సేవలకు మరో ముందడుగు

హైదరాబాద్, అక్టోబర్ 07 :వ్యవసాయ విస్తరణ అధికారి నుంచి కమిషనరేట్ స్థాయి అధికారుల వరకు రైతులకు ఇప్పటికే వ్యవసాయ విస్తరణ సేవలు అందుతున్నాయి. వీటికి అదనంగా, రైతులు తమ సమస్యల పరిష్కారం కోసం అరచేతిలోని మొబైల్ ఫోన్ ద్వారానే సలహాలు పొందేందుకు వీలుగా కిసాన్ హెల్ప్లైన్ సెంటర్ మరో ముందడుగుగా నిలుస్తోంది. పంటకు తెగులు సోకినా, ఎరువు ఎంత వేయాలో తెలియకపోయినా, ప్రభుత్వ పథకం అందకపోయినా రైతులు టోల్ ఫ్రీ నంబర్ 1800-180-1551 కు ఫోన్ చేస్తే చాలు. తెలుగులోనే తక్షణ సలహా, సమాచారం అందుతాయి. సేవలు ప్రతిరోజూ ఉదయం 6:00 గంటల నుంచి రాత్రి 10:00 గంటల వరకు, వారంలో 7 రోజులూ అందుబాటులో ఉంటా యి. కేంద్ర వ్యవసాయ మరియు రైతు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 2004 నుంచి దేశవ్యా ప్తంగా అమలవుతున్న ఈ కేంద్రం, తెలంగాణ రైతుల కోసం హైదరాబాద్లోని వ్యవసాయ కమి షనర్ సంచాలకుల కార్యాలయంలో పనిచేస్తోంది. సలహాలతో పాటు, వ్యవసాయ పథకాలకు సంబంధించిన రైతుల ఫిర్యాదులను కూడా ఇదే నంబర్ ద్వారా తెలియజేయవచ్చు. "రైతుల ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ" ఇదే డిజిటల్ వేదికపై అందుబాటులో ఉండగా, సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవడంలో కేంద్రం సహాయపడుతుంది. ఈ సేవలు మారుమూల గ్రామాల్లోని ప్రతి రైతుకూ తెలిసేలా, క్షేత్రస్థాయి వ్యవసాయ విస్తరణ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించాలని, రైతులు తమ సందేహాల నివృత్తికి, సమస్యల పరిష్కారానికి ఈ టోల్ ఫ్రీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ సంచాలకులు డా. బి. గోపి, ఐ.ఏ.ఎస్ సూచించారు.

ఓపెన్ఏఐ, ఆంథ్రోపిక్‌లో చైనా గూఢచారులు

మాజీ పరిశోధకుడి సంచలన ఆరోపణలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 07 : అమెరికా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో సంచలన ఆరోపణలు తెరపైకి వచ్చాయి. చైనాకు చెందిన గూఢచారులు ఇప్పటికే అమెరికా ప్రముఖ ఏఐ సంస్థలు ఓపెన్ఏఐ, ఆంథ్రోపిక్‌లోకి చొరబడ్డారని మాజీ పరిశోధకుడు జాకబ్ కాక్సన్ ఆరోపించారు. ఈ విషయం 90 శాతం నిజమని తాను నమ్ముతున్నట్లు చెప్పారు. అమెరికన్ వ్యాపారవేత్త ప్యాట్రిక్ బెట్-డేవిడ్ నిర్వహించిన పాడ్‌కాస్ట్‌లో కాక్సన్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ విషయంపై ఎంత నమ్మకం ఉందని అడగ్గా.. "90 శాతం నమ్మకంగా ఉన్నాను" అని స్పష్టం చేశారు. కాక్సన్ గతంలో ఓపెన్ఏఐ, ఆ తర్వాత ఆంథ్రోపిక్‌లో పరిశోధకుడిగా పనిచే శారు. ఏఐ అభివృద్ధి అత్యంత వేగంగా సాగడం మానవాళి భవిష్యత్తుకే ముప్పుగా మారొచ్చం టూ ఇటీవల ఆందోళన వ్యక్తం చేసి ఆంథ్రోపిక్‌కు రాజీనామా చేశారు. అమెరికా ఏఐ సంస్థల్లో చైనాకు అనుకూలమైన వ్యక్తులకు అంతర్గత సమాచారం అందుబాటులో ఉంటే.. కీలక మోడళ్లను రహస్యంగా బయటకు తరలించే అవకాశం ఉందని కాక్సన్ హెచ్చరించారు. అమెరికా సాంకేతిక ఆధిక్యాన్ని చైనా ఎప్పుడైనా దెబ్బతీయగలదని పేర్కొన్నారు. అమెరికా ఏఐ రంగంలో విదేశీ గూఢచర్యంపై ఆందోళనలు ఇప్పటికే ఉన్నాయి. చైనా సంస్థలు అమెరికా అభివృద్ధి చేసిన ఏఐ మోడళ్లను 'డిస్టిలేషన్' పద్ధతిలో అనుకరిస్తున్నాయనే ఆరోపణలు కూడా వచ్చాయి. ఇందులో పెద్ద ఏఐ మోడల్‌ను 'టీచర్'గా ఉపయోగించి చిన్న మోడల్‌కు శిక్షణ ఇస్తారు. అమెరికా రక్షణ సంస్థల్లో విదేశీ ఉద్యోగులపై కఠినమైన భద్రతా తనిఖీలు ఉంటాయని కాక్సన్ చెప్పారు. కానీ సిలికాన్ వ్యాలీలోని ఏఐ సంస్థల్లో ఇలాంటి తనిఖీలు తక్కువగా ఉన్నాయని ఆరోపించారు. ఉద్యోగుల నియామకంలో రక్షణ రంగ స్థాయి భద్రతా నిబంధనలు తీసుకురావాలని సూచించారు. అమెరికా-చైనా మధ్య ఏఐ పోటీ మరింత వేడెక్కుతోంది. సెప్టెంబరులో చైనాకు చెందిన 10 ప్రముఖ ఏఐ సంస్థలు 16 మోడళ్లను విడుదల చేసినట్లు నిక్కీ లెక్కలు చెబుతున్నాయి. అదే సమయంలో అమెరికా ప్రముఖ ఏఐ సంస్థలు 10-12 కొత్త మోడళ్లు, వేరియంట్లు, ప్రత్యేక రీజనింగ్ మోడళ్లను విడుదల చేశాయి.

శివ రాజ్ కుమార్‌కి తప్పిన ప్రమాదం..

చిత్రదుర్గ, అక్టోబర్ 07 : ప్రముఖ కన్నడ నటుడు శివ రాజ్ కుమార్‌కు తృటిలో పెను ప్రమాదం తప్పింది. తన కొత్త చిత్రం 'బెయిల్' ప్రమోషన్లలో భాగంగా కర్ణాటకలోని చిత్రదుర్గలో పర్యటిస్తున్నప్పుడు ఈ ఘటన చోటుచేసుకుంది. అభిమానుల మధ్య నుంచి థియేటర్‌లోకి వెళుతుండగా ఆయనకు అత్యంత సమీపంలో ఓ బాణసంచా ఒక్కసారిగా పేలింది. దీంతో ఆయన ఉలిక్కిపడ్డారు. వివరాల్లోకి వెళితే, చిత్రదుర్గలోని బసవేశ్వర థియేటర్ వద్దకు శివ రాజ్ కుమార్ రాగానే అభిమానులు పెద్ద సంఖ్యలో గుమిగూడారు. ఆయన థియేటర్‌లోకి ప్రవేశిస్తున్న సమయంలో స్వాగతం పలికేందుకు సిద్ధం చేసిన బాణసంచాలో ఒకటి ఆయన పక్కనే పేలింది. వెంటనే అప్రమత్తమైన శివరాజ్ కుమార్, నిప్పురవ్వల నుంచి తనను తాను కాపాడుకునేందుకు చేతులతో ముఖాన్ని, తలను కప్పుకున్నారు. భద్రతా సిబ్బంది వెంటనే ఆయనకు రక్షణగా నిలిచారు. ఈ ఘటనతో అక్కడ కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొన్నా, శివరాజ్ కుమార్‌కు ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఆ తర్వాత తేరుకున్న ఆయన, ప్రమోషన్ కార్యక్రమాన్ని యథావిధిగా కొనసాగించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవ్వగా, భద్రతా ఏర్పాట్లపై అభిమానులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలే క్యాన్సర్ నుంచి కోలుకున్న శివ రాజ్ కుమార్... 'జైలర్ 2' వంటి ఇతర ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు.

పోరాటం ఆపేది లేదు

(మొదటిపేజీ తరువాయి)

ఓటు హక్కును హరిస్తూ ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తే దేశ ప్రజలు బీజేపీని ఏమాత్రం క్షమించరని ఘాటుగా హెచ్చరించారు. ఈ పోరాటం కేవలం కాంగ్రెస్ పార్టీకి సంబంధించినది కాదని, యావత్ దేశ ప్రజల ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసమని రేవంత్ రెడ్డి తేల్చిచెప్పారు. అక్రమ నిర్బంధాలు, పోలీసుల దౌర్జన్యాలతో కాంగ్రెస్ కార్యకర్తల మనోధైర్యాన్ని దెబ్బతీయలేరని, లాఠీలు, అరెస్టులతో పోరాటాలను ఆపడం ఎవరి వల్లా కాదని స్పష్టం చేశారు.ఓట్ల తొలగింపు వ్యవహారంలో కేంద్ర ఎన్నికల సంఘం తీరు అత్యంత వివాదాస్పదంగా మారిందని, నిష్పక్షపాతంగా వ్యవహరించడంలో విఫలమైన చీఫ్ ఎలక్షన్ కమిషనర్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర పాలకుల్లో పెరిగిపోతున్న అసహనానికి ఈ అక్రమ అరెస్టులే నిదర్శనమని, ప్రజల హక్కులను కాపాడే వరకు పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మరోవైపు రాహుల్‌గాంధీకి మద్దతుగా దీక్ష చేపడతానన్న కాంగ్రెస్ పార్టీ నేత జగ్గారెడ్డి తెలిపారు. బీజేపీ, ఈసీకి వ్యతిరేకంగా రాహుల్ పోరాటం చేస్తున్నారన్న జగ్గారెడ్డి రాహుల్‌కు మద్దతుగా కాంగ్రెస్ కార్యకర్తలు రోడ్డుపైకి వచ్చి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. రాహుల్ ఎన్ని రోజులు పోరాటం చేస్తే అన్ని రోజులు దీక్ష చేపడతాని జగ్గారెడ్డి స్పష్టం చేశారు.

యాసంగిలో వరి బదులు ఆరుతడి పంటలే మేలు

- భూగర్భ జలాలను బట్టే పంట ఎంపిక
- వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ సూచన
- వ్యవసాయ అనుబంధ శాఖల జిల్లా అధికారులతో సమీక్ష
- విత్తనాలు, ఎరువుల సరఫరాపై పలు సూచనలు





హైదరాబాద్, అక్టోబర్ 07 :ఎల్‌నినో ప్రభావం వల్ల ఈసారి వర్షాలు, ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గులు ఉండే అవకాశం ఉన్నందున, రానున్న యాసంగిలో రైతులు వరికి బదులు తక్కువ నీటితో పండే పంటల వైపు మళ్లేలా చూడాలని వ్యవసాయ ఉత్పత్తి కమిషనర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి కె. సురేంద్ర మోహన్, ఐ.ఏ.ఎస్. జిల్లా వ్యవసాయ అధికారులను ఆదేశించారు. రబీ 2026-27 కార్యాచరణ ప్రణాళికపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నీటి లభ్యత తక్కువగా ఉండే పరిస్థితుల్లో వరి సాగు రైతులకు నష్టం కలిగించే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల స్వల్పకాలిక పప్పుధాన్యాలు, నూనెగింజల పంటలతో పాటు మంచి ఆదాయాన్నిచ్చే కూరగాయల సాగును ప్రోత్సహించాలని సూచించారు. ప్రతి రైతూ తన ప్రాంతంలోని భూగర్భ జలాల లభ్యతను చూసుకున్న తరువాతే పంటను ఎంచుకునేలా క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) శాస్త్రవేత్త ఈ యాసంగిలో ఎల్‌నినో వల్ల వాతావరణంలో చోటుచేసుకునే మార్పులు, వర్షపాత స్థితి, ఉష్ణోగ్రతల అంచనాలను అధికారులకు వివరించారు. కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధనా సంస్థ (క్రిడా) శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో తీసుకోవలసిన చర్యలను వివరిస్తూ, భూగర్భ జలాల లభ్యత ఆధారంగానే పంటల ఎంపిక, సాగు జరగాలని స్పష్టం చేశారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు మాట్లాడుతూ, ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, భూగర్భ జలమట్టాలను దృష్టిలో ఉంచుకుని వరికి బదులు ఆరుతడి పంటలను ఎంచుకోవాలని సూచించారు. పప్పుధాన్య, నూనెగింజల, కూరగాయల పంటలకు అనువైన విత్తన కాలాలను కూడా వివరించారు. వ్యవసాయ, ఉద్యాన విశ్వవిద్యాలయాల శాస్త్రవేత్తలు ఈ సీజన్‌లో రైతులు సాగు చేయడానికి అనువైన పంట రకాలను సిఫార్సు చేశారు. యాసంగి సీజన్‌లో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో, సరిపడా అందుబాటులో ఉండేలా సరఫరా పరిస్థితిని కూడా కమిషనర్ సమీక్షించారు. రాష్ట్రంలో 2025-26లో 26 జిల్లాల్లో నత్రజని,భాస్వరం ఎరువుల వినియోగ నిష్పత్తులు జాతీయ సగటు (9.7 : 3.7 : 1) కంటే అధికంగా నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో రైతులు శాస్త్రవేత్తల సిఫార్సుల మేరకు మాత్రమే ఎరువులను వినియోగించేలా క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ సంచాలకులు డాక్టర్ బి. గోపి, ఐ.ఏ.ఎస్. జిల్లా అధికారులను ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ శాఖ సంచాలకులు డాక్టర్ బి. గోపి, ఐ.ఏ.ఎస్., ఉద్యానవన శాఖ సంచాలకులు డాక్టర్ యాస్మీన్ బాషా, ఐ.ఏ.ఎస్. పాల్గొన్నారు. వీరితో పాటు వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు; ఇక్రిశాట్, క్రిడా, ఐఎండీ, ఐఐఆర్ఆర్, ఐఐఎంఆర్, ఐఐఓఆర్ సంస్థల శాస్త్రవేత్తలు; ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యానవన విశ్వవిద్యాలయాలకు చెందిన శాస్త్రవేత్తలు జిల్లా వ్యవసాయ అధికారులు జిల్లా ఉద్యానవన అధికారులు మార్కెటింగ్ మరియు సహకార శాఖ అధికారులు పాల్గొన్నారు.

కొమురం భీం పోరాట స్ఫూర్తితో జర్నలిస్టులు ఉద్యమించాలి

ఆసిఫాబాద్ సభలో TUWJ రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ





హైదరాబాద్, అక్టోబర్ 07 :
జర్నలిస్టులు హక్కుల సాధనకై ఉద్యమించాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ పిలుపు నిచ్చారు. బుధవారం నాడు టీయూడ బ్ల్యూజే కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా తృతీయ మహాసభ, ఆసిఫాబాద్ పట్టణంలోని రోజ్ గార్డె న్స్ ఫంక్షన్ హాలులో, కొమురం భీం ప్రాంగణంలో జరిగింది. ఈ సభకు ఆయన ముఖ్య అథితిగా హాజరై ప్రసంగించారు. ఆసిఫాబాద్ అంటే అడవి మాత్రమే కాదని, ఆదివాసీ బిడ్డల ఆత్మగౌ రవానికి అది చిరునామా అని విరాహత్ అభివర్ణించారు. ఆసిఫాబాద్ ఒక జిల్లా మాత్రమే కాదని, కొమురం భీం పోరాట వారసత్వాన్ని మోస్తున్న నేల అని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పోరాటాలు, త్యాగాలు, విజయాలతో కూడిన సుదీర్ఘ చరిత్ర కలిగి ఉన్న ఏకైక సంఘం టీయూడబ్ల్యూజే మాత్రమేనని ఆయన స్పష్టం చేసారు. జర్నలిస్టుల గొంతుకగా, 75ఏళ్ల నుండి మడమ తిప్పని పోరాటాలు చేస్తున్న గొప్ప చరిత్ర తమ సంఘానికి ఉందని, తెలుగు రాష్ట్రాల్లో జర్నలిస్టులు పొందుతున్న సౌకర్యాలు తమ సంఘం సాధించినవేనని ఆయన స్పష్టం చేసారు. నాటి నుండి నేటి వరకు తమ సంఘం ఏ రాజకీయ పార్టీకో, ప్రభుత్వానికో అనుబంధంగా పనిచేయ లేదని, జర్నలిస్టుల, మీడియా సంస్థల పక్షపాతిగా నిలబడి రాజీలేని పోరాటాలు కొనసాగిస్తున్నట్లు విరాహత్ అలీ అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో జర్నలిస్టులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక విస్మరించడం సరైంది కాదని ఆయన ఆవేదన వ్యక్తం చేసారు. రాష్ట్రంలో జర్నలిస్టులకు క్యాష్ లెస్ హెల్త్ స్కీమ్ అమలుకాక పోవడంతో అప్పులు చేసి చికిత్స పొందుతున్నారని, మరి కొందరు అప్పులు చేసే స్థోమత లేక అనారోగ్యాలతో తనువు చాలిస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేసారు. అలాగే ఇండ్లు, ఇంటి స్థలాల హామీని ప్రభుత్వం నేటికీ అమలు చేయకపోవడంతో జర్నలిస్టుల్లో తీవ్ర నిరాశ నెలకొందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం జర్నలిస్టుల ప్రధాన సమస్యలపై దృష్టి సారించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని విరాహత్ అలీ కోరారు. ఇంకా ఈ సభలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రకాష్ రెడ్డి, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్ రహ్మాన్, సంపత్ తదితరులు పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుండి దాదాపు 250మంది జర్నలిస్టులు మహాసభకు హాజరవ్వడం విశేషం.

ఆర్బీఐ నిర్ణయంతో స్టాక్ మార్కెట్ కుదేలు..



న్యూఢిల్లీ, అక్టోబర్ 07 :దేశీయ స్టాక్ మార్కెట్లకు బుధవారం భారీ షాక్ తగిలింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచి 5.5 శాతానికి చేర్చడంతో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ దెబ్బతింది. దీంతో వరుసగా రెండు రోజుల లాభాలకు బ్రేక్ పడింది. సెన్సెక్స్ 429.11 పాయింట్లు నష్టపోయి 72,638.70 వద్ద ముగిసింది. నిఫ్టీ 173.05 పాయింట్లు కోల్పోయి 22,603.05 వద్ద స్థిరపడింది. ఆర్బీఐ వడ్డీ రేట్లను పెంచడంతో పాటు తన ద్రవ్య విధాన వైఖరిని 'క్యాలిబ్రేటెడ్ టైటనింగ్'గా మార్చింది. దీంతో రానున్న రోజుల్లో వడ్డీ రేట్ల పరిస్థితి మరింత కఠినంగా ఉండొచ్చన్న ఆం దోళన ఇన్వెస్టర్లలో పెరిగింది. ఫలితంగా మార్కెట్‌లో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. నిఫ్టీ 22,700 స్థాయిని కోల్పోయి 22,600 కీలక మద్దతు స్థాయికి చేరిందని మార్కెట్ నిపుణులు తెలిపారు. 22,600 కంటే దిగువన స్థిరంగా కొనసాగితే 22,400 వరకు పడిపోయే అవకాశం ఉందన్నారు. పైకి వెళ్లాలంటే 22,800 స్థాయి కీలక అడ్డంకిగా ఉంటుందని పేర్కొన్నారు. నిఫ్టీలో ట్రైటా న్ కంపెనీ, బీఈఎల్, హిందాల్కో ఇండస్ట్రీస్ షేర్లు భారీగా నష్ట పోయాయి. ముఖ్యంగా మెటల్ షేర్లలో అమ్మకాలు వెల్లువెత్త డంతో మార్కెట్‌పై ఒత్తిడి పెరిగింది. విస్తృత మార్కెట్‌లోనూ బలహీనత కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 0.63 శాతం పడిపోయింది. అయితే నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 సూచీ 0.30 శాతం లాభపడటం కొంత ఊరటనిచ్చింది. రంగాల వారీ గా చూస్తే నిఫ్టీ మెటల్ సూచీ అత్యధికంగా నష్టపోయింది. మరో వైపు నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ సూచీ లాభాల్లో ముగిసి మార్కెట్‌కు కొంత మద్దతుగా నిలిచింది. ఇక రానున్న రోజుల్లో ఆర్బీఐ నిర్ణయాలు ఆర్థిక వృద్ధి, మార్కెట్‌లో నగదు లభ్యత, కంపెనీల ఆదాయాలపై ఎలాంటి ప్రభావం చూపుతాయన్నది ఇన్వెస్టర్లు పరిశీలించనున్నారు. సెప్టెంబర్ త్రైమాసిక ఫలితాల సీజన్ కూడా మార్కెట్‌కు కీలకం కానుంది. పెరుగుతున్న ఉత్పత్తి వ్యయాలను కంపెనీలు ఎలా ఎదుర్కొంటాయి? ధరలను కొనసాగిం చగలవా? డిమాండ్‌ను నిలబెట్టుకోగలవా? అన్న అంశాలపై ఇన్వెస్టర్లు దృష్టి పెట్టనున్నారు.మరోవైపు ప్రముఖ నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ (ఎన్‌బీఎఫ్‌సీ) బజాజ్ ఫైనాన్స్, తన ఫిక్స్‌డ్ డిపాజిట్లపై (ఎఫ్‌డీ) వడ్డీ రేట్లను పెంచుతు న్నట్లు ప్రకటించింది. అక్టోబర్ 7 నుంచి అమల్లోకి వచ్చిన ఈ కొత్త రేట్ల ప్రకారం, వడ్డీని 15 నుంచి 40 బేసిస్ పాయింట్ల వరకు పెంచారు. దీనివల్ల సీనియర్ సిటిజన్లు గరిష్ఠంగా 8.15 శాతం వరకు వడ్డీని పొందనున్నారు. ఆర్బీఐ రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచడంతో 5.50 శాతానికి చేరిన నేపథ్య ంలో, బజాజ్ ఫైనాన్స్ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. తాజా సవరణల ప్రకారం, సాధారణ డిపాజిటర్లు 31 నుంచి 60 నెలల కాలపరిమితి కలిగిన డిపాజిట్లపై ఇప్పుడు 7.75 శాతం వరకు వార్షిక వడ్డీని పొందవచ్చు. గతంలో ఈ వడ్డీ రేటు 7.40 శాతంగా ఉండేది. అదేవిధంగా, 12-17 నెలల డిపాజిట్లపై వడ్డీని 6.80 శాతానికి, 18-30 నెలల డిపాజిట్లపై 7.00 శాతానికి పెంచారు. సీనియర్ సిటిజన్లకు సాధారణ రేట్ల కంటే అదనంగా 0.40 శాతం అధిక వడ్డీని సంస్థ అందించనుంది. దీంతో 31-60 నెలల కాలపరిమితి గల డిపాజిట్లపై వారికి గరిష్ఠంగా 8.15 శాతం వడ్డీ లభిస్తుంది. ఇక ఇప్పటికే ఉన్న డిపాజిట్లను రెన్యూ వల్ చేసుకునే వారికి అదనంగా 0.10 శాతం ప్రయోజనం ఉంటుంది. తద్వారా సీనియర్ సిటిజన్లు రెన్యూవల్‌పై గరిష్ఠంగా 8.25 శాతం వరకు వడ్డీ పొందే అవకా శం ఉంది. ఈ పెంచిన వడ్డీ రేట్లు క్యుములేటివ్, నాన్-క్యుము లేటివ్ ఆప్షన్లు రెండింటికీ వర్తిస్తాయి. కనిష్ఠంగా రూ. 15,000 నుంచి గరిష్ఠంగా రూ. 3 కోట్ల వరకు చేసే డిపాజిట్లకు ఈ సవరించిన రేట్లు వర్తిస్తాయని కంపెనీ స్పష్టం చేసింది.

ప్రీ-లాంచ్ పేరుతో రూ.500 కోట్ల మోసం!

- సంస్థ ఛైర్మన్ పై సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు

హైదరాబాద్, అక్టోబర్ 07 : తెల్లాపూర్‌లో ప్రీ-లాంచ్ ప్రాజెక్టు పేరుతో త్రిపుర కన్‌స్ట్రక్షన్స్ అనే సంస్థ తమను మోసం చేసిందని ఆరోపిస్తూ సుమారు 350 మంది బాధితులు బుధవారం హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) పోలీసులను ఆశ్రయించారు. ఫ్లాట్ల కోసం తమ నుంచి సుమారు రూ.500 కోట్లు వసూలు చేసి, నిర్మాణం చేపట్టకుండా మోసం చేశారని వారు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. సంస్థ ఫౌండర్-ఛైర్మన్ పసుపులేటి సుధాకర్‌తో పాటు ఇతరులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధితుల కథనం ప్రకారం, 2021లో తెల్లాపూర్‌లో "త్రిపుర నిర్వాణ" పేరుతో ఓ భారీ రెసిడెన్షియల్ ప్రాజెక్టును త్రిపుర కన్‌స్ట్రక్షన్స్ ప్రకటించింది. మార్కెట్ ధరల కంటే తక్కువకే ఫ్లాట్లు ఇస్తామని ప్రీ-లాంచ్ ఆఫర్‌తో ఆకర్షించడంతో, ఎంతోమంది తమ కష్టార్జితాన్ని ఈ ప్రాజెక్టులో పెట్టుబడిగా పెట్టారు. వీరిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, బీడీఎల్ ప్రస్తుత, మాజీ ఉద్యోగులు, పదవీ విరమణ చేసిన వారు అధికంగా ఉన్నారు. డబ్బులు చెల్లించి ఏళ్లు గడుస్తున్నా, ఇంతవరకు కనీసం పునాది పనులు కూడా మొదలుపెట్టలేదని బాధితులు వాపోతున్నారు. ప్రాజెక్టు కోసం కేటాయించిన భూమిని తమకు న్యాయం చేయకుండా మరో నిర్మాణ సంస్థకు విక్రయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని బాధితులు తమ ఫిర్యాదులో తీవ్ర ఆరోపణలు చేశారు. త్రిపుర కన్‌స్ట్రక్షన్స్ తెల్లాపూర్ ప్రాజెక్టుపై కేసులు నమోదు కావడం ఇది మొదటిసారి కాదు. ఇదే ప్రాజెక్టుకు సంబంధించి 10 మంది కొనుగోలుదారుల నుంచి రూ. 5.68 కోట్లు వసూలు చేశారని ఆరోపిస్తూ ఈ ఏడాది మార్చిలో హైదరాబాద్ సీసీఎస్‌లో ఒక కేసు నమోదైంది. అంతకుముందు, 2025 నవంబర్‌లో సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగంలోనూ 'త్రిపుర నిర్వాణ' పేరుతో చేపట్టిన ప్రాజెక్టులో 9 మంది ఇన్వెస్టర్లు రూ. 4.41 కోట్లు నష్టపోయామని ఫిర్యాదు చేశారు. ఈ కేసులతో పాటు తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (టీజీ-రెరా) ఎదుట కూడా త్రిపుర కన్‌స్ట్రక్షన్స్‌పై పలు ఫిర్యాదులు ఉన్నాయి. తూప్రాన్ సమీపంలోని 'త్రిపుర సుకృతి' ప్రాజెక్టుకు సంబంధించి రెరా రిజిస్ట్రేషన్ లేకుండానే ప్లాట్లు విక్రయించినట్లు గతంలో టీజీ-రెరా నిర్ధారించింది. ఈ లావాదేవీలపై విచారణ జరిపి, తమ డబ్బును తిరిగి ఇప్పించాలని వారు పోలీసులను వేడుకున్నారు. కాగా, బాధితులు ఆరోపిస్తున్న రూ.500 కోట్ల సంఖ్యపై పోలీసుల దర్యాప్తు తర్వాతే పూర్తి స్పష్టత రానుంది. ఈ ఘటనపై పోలీసులు విచారణ ప్రారంభించారు.

బలగం TV BALAGAM

balagamtv100@gmail.com

(మొదటిపేజీ తరువాయి)

రెపో రేటు 5.50 శాతానికి పెంపు

ద్రవ్యోల్బణం 4.82 శాతానికి చేరింది. జులైలో ఇది 4.45 శాతంగా ఉంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్లను దాటాయి. అంతర్జాతీయంగా బాండ్ ఈల్డ్స్ పెరగడం, క్రూడ్ ధరలు ఎగబాకడం, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు పెరగడంతో రెపో రేటును యథాతథంగా ఉంచే అవకాశం తగ్గిందని ఆర్థిక నిపుణులు తెలిపారు. ఫిబ్రవరి 2023 తర్వాత తొలిసారి రెపో రేటు పెరగొచ్చని నిపుణులు ముందుగానే అంచనా వేశారు. ద్రవ్యోల్బణం దాదాపు 5 శాతానికి చేరుతున్న నేపథ్యంలో రానున్న సమావేశాల్లోనూ కఠిన నిర్ణయాలు ఉండొచ్చని ఎస్‌బీఐ రీసెర్చ్ పేర్కొంది. ప్రపంచ ఆర్థిక పరిస్థితులు, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, మార్కెట్లలో మారుతున్న రిస్క్‌ల నేపథ్యంలో ముందస్తు చర్య తీసుకోవడం మంచిదని ఎస్‌బీఐ రీసెర్చ్ ఆర్థిక నిపుణులు అభిప్రాయపడ్డారు. ఎల్‌నినో ప్రభావం, అక్టోబర్‌లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం కూడా రబీ పంటలపై ప్రభావం చూపే అవకాశం ఉందని వారు తెలిపారు. మరోవైపు రాబోయే డిసెంబర్ ద్రవ్య పరపతి సమీక్షలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) రెపో రేటును ఏకంగా 50 బేసిస్ పాయింట్లు (0.50 శాతం) పెంచే అవకాశం ఉందని ఎస్‌బీఐ రీసెర్చ్ తన తాజా నివేదికలో అంచనా వేసింది. దేశంలో పెరుగుతున్న ద్రవ్యోల్బణం, అనిశ్చితంగా ఉన్న అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ఆర్‌బీఐ ఈ 'జంబో హైక్' వైపు మొగ్గు చూపవచ్చని బుధవారం విడుదల చేసిన ఈ నివేదిక పేర్కొంది. వడ్డీ రేట్లను విడతలవారీగా స్వల్పంగా పెంచడం కంటే, ఒకేసారి కఠిన చర్యలు తీసుకోవడమే సమంజసమని ఎస్‌బీఐ గ్రూప్ చీఫ్ ఎకనమిక్ అడ్వైజర్ డాక్టర్ సౌమ్య కాంతి ఘోష్ అభిప్రాయపడ్డారు. డిసెంబర్ నాటికి రెపో రేటును 6 శాతానికి చేర్చడమే సరైన మార్గమని ఆయన స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) సమావేశంలో రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచి, 5.50 శాతానికి చేర్చిన సంగతి విదితమే. ఆర్‌బీఐ తన వైఖరిని మార్చుకుందని ఎస్‌బీఐ రీసెర్చ్ విశ్లేషించింది. గతంలో పరిస్థితులను కేవలం పరిశీలిస్తున్నట్లు పేర్కొన్న ఆర్‌బీఐ, అక్టోబర్ పాలసీలో మాత్రం ద్రవ్యోల్బణం కట్టడిపై తన కఠిన వైఖరిని స్పష్టంగా ప్రదర్శించిందని తెలిపింది. వృద్ధి, ద్రవ్యోల్బణం అంచనాలను కూడా ఆర్‌బీఐ సవరించింది. 2027 ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి అంచనాను 7.1 శాతానికి, సీపీఐ ద్రవ్యోల్బణం అంచనాను 5.20 శాతానికి పెంచింది. కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో జీడీపీ వృద్ధి 7.5 శాతానికి చేరవచ్చని ఎస్‌బీఐ అంచనా వేస్తోంది. చారిత్రక పరిణామాలను పరిశీలిస్తే, ద్రవ్యోల్బణం తీవ్రతకు అనుగుణంగానే ఆర్‌బీఐ రెపో రేటు పెంపు ఉంటుందని నివేదిక గుర్తుచేసింది. ప్రస్తుత అంచనాల ప్రకారం, 2026 నవంబర్ నాటికి ద్రవ్యోల్బణం 6.8 శాతానికి చేరితే, రెపో రేటును 6 శాతం వరకు పెంచే అవకాశం ఉందని నివేదిక వెల్లడించింది.

తెలంగాణలో పెరిగిన విద్యుత్ డిమాండ్

ప్రచారం చేస్తున్నారని భట్టి విక్రమార్క విమర్శించారు. తెలంగాణ స్టేట్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ , ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ , విద్యుత్ పంపిణీ సంస్థలను ప్రైవేటీకరించే ఆలోచన ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. అలాగే రాష్ట్ర విద్యుత్ సంస్థలను పబ్లిక్‌గా లిస్ట్ చేయడం లేదా వాటిని ప్రభుత్వ రంగం నుంచి తప్పించే ప్రతిపాదన కూడా లేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను మరింత బలోపేతం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. నెహ్రూ అనుసరించిన ఆర్థిక విధానాలను ప్రస్తావించిన భట్టి.. మిశ్రమ ఆర్థిక వ్యవస్థతో పాటు బలమైన ప్రభుత్వ రంగ సంస్థలు కాంగ్రెస్ విధానంలో కీలక భాగమని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేస్తూనే రాష్ట్ర అభివృద్ధికి అనుగుణంగా విద్యుత్ రంగాన్ని మరింత పటిష్టం చేస్తామని తెలిపారు.

హెన్రీ కాగన్, కెన్సో సోయికి నోబెల్

సాధ్యమైంది. పీటర్ హెగెమాన్, జార్జ్ నాగెల్ ఒక ఏకకణ నాచు (కైవలం)లో ఛానెల్ రోడాప్సిన్ అనే అద్భుతమైన ప్రోటీన్ ఉన్నట్లు కనుగొన్నారు. కార్ల్ డిస్సెరోత్ ఈ ప్రోటీన్‌ను నరాల కణాల కోసం కాంతితో నియంత్రించగలిగే ఒక 'స్విచ్' విధానం తీసుకొచ్చారు. ప్రముఖ శాస్త్రవేత్త జార్జ్ నాగెల్ 1953లో జన్మించారు. ఆయన 1988లో జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్ యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. జార్జ్ నాగెల్ ప్రస్తుతం యూనివర్సిటీ ఆఫ్ వుర్జ్‌బర్గ్ (జర్మనీ) మాలిక్యులర్ ప్లాంట్ ఫిజియాలజీ విభాగంలో ప్రొఫెసర్‌గా సేవలు అందిస్తున్నారు. ఈ పురస్కారానికి ఎంపికైన పరిశోధనను ఆయన జర్మనీలోని 'మాక్స్ ప్లాంక్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ బయోఫిజిక్స్'లో చేసి చూపించారు. వైద్యశాస్త్రంలో నోబెల్ బహుమతికి ఎంపికైన పీటర్ హెగెమాన్ 1984లో జర్మనీకి చెందిన మాక్స్ ప్లాంక్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ బయోకెమిస్ట్రీ విభాగం నుంచి పీహెచ్‌డీ పూర్తి చేశారు. జర్మనీలోని హంబోల్ట్ యూనివర్సిటీ ఆఫ్ బెర్లిన్‌లో 'హర్ట్జ్ సీనియర్ ప్రొఫెసర్ ఆఫ్ న్యూరోసైన్స్'గా పీటర్ హెగెమాన్ చేస్తున్నారు. ఈ అత్యున్నత పురస్కారానికి ఎంపికైన పరిశోధనను ఆయన జర్మనీలోని మాక్స్ ప్లాంక్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ బయోకెమిస్ట్రీ లో చేసి నిరూపించారు.నోబెల్ బహుమతి విజేతలకు అందించే మొత్తం నగదు బహుమతి 1.2 కోట్ల స్వీడిష్ క్రోనర్ (దాదాపు 11 లక్షల 96 వేల డాలర్లు). ఒకరు విజేతగా నిలిస్తే వారికే మొత్తం నగదు లభిస్తుంది. ముగ్గురు విజేతలు కనుక ఈ మొత్తాన్ని ఆ ఏడాది విజేతలకు సమానంగా పంచుతారు. నోబెల్ అసెంబ్లీ 1977 ఏడాదిలో స్థాపించారు. వైద్య రంగంలో నోబెల్ బహుమతిని అందజేసే కరోలిన్స్కా ఇన్‌స్టిట్యూట్‌కు ఇది ప్రధాన సంస్థ. స్టాక్‌హోంలోని కరోలిన్స్కా ఇన్‌స్టిట్యూట్‌లో నోబెల్ బహుమతి ప్రకటన చేస్తారు. ఈ ప్రకటనతో 2026 ఏడాదికిగానూ నోబెల్ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఇతర రంగాలలో సైతం నోబెల్ విజేతలను ప్రకటిస్తారు.

ఈజీ మనీ ఆఫర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

సైబర్ మోసగాళ్లకు మ్యూల్ అకౌంట్లు సమకూర్చినట్లు ఆరోపణలు ఎదుర్కొంటుండగా, ఒక ఫ్లిప్‌కార్ట్ ఉద్యోగి తన బ్యాంక్ అకౌంట్‌ను మోసపూరిత లావాదేవీలకు ఉపయోగించేందుకు ఇచ్చినట్లు పోలీసులు గుర్తించారు. మరో నిందితుడికి దేశవ్యాప్తంగా 50 సైబర్ క్రైమ్ కేసులతో సంబంధాలు ఉన్నట్లు తేలింది. ఇంకొకరికి 60 కేసులతో సంబంధం ఉన్నట్లు గుర్తించారు. మొత్తం 101 మందిలో 50 మందికి దేశవ్యాప్తంగా ఐదుకు పైగా నేర సంబంధాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. దర్యాప్తులో మరో షాకింగ్ విషయం కూడా బయటపడింది. మ్యూల్ అకౌంట్ల ద్వారా వచ్చిన డబ్బును ఏటీఎంల నుంచి విత్‌డ్రా చేయడం, ఇతర ఖాతాలకు బల్క్ ట్రాన్స్‌ఫర్లు చేయడం, విదేశీ లావాదేవీలకు ఉపయోగించడం వంటి మార్గాల్లో తరలించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ పనికి అకౌంట్ హోల్డర్లు, మధ్యవర్తులకు మోసపూరిత మొత్తంలో 5 శాతం వరకు కమీషన్ ఇచ్చినట్లు దర్యాప్తులో వెల్లడైంది. అంటే సోషల్ మీడియాలో కనిపించే 'అకౌంట్ ఇవ్వండి.. కమీషన్ తీసుకోండి' అనే ఈజీ మనీ ఆఫర్ వెనుక ఎంత పెద్ద నెట్‌వర్క్ ఉండొచ్చో ఊహించుకోవచ్చు. ఈ ఆపరేషన్‌లో ఏడు సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్లలో నమోదైన 51 కేసులకు సంబంధించి అరెస్టులు జరిగాయి. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 1,172 నేర సంబంధాలు గుర్తించగా, అందులో 206 తెలంగాణకు సంబంధించినవిగా గుర్తించారు. ఇక యువత ముఖ్యంగా గుర్తుంచుకోవాల్సిన విషయం ఏంటంటే.. ఓటీపీ, సిమ్, కేవైసి వివరాలు, సోషల్ మీడియా ప్రొఫైల్ కూడా నేరగాళ్లకు ఆయుధాలుగా మారొచ్చు. పార్ట్‌టైమ్ జాబ్, ఇన్‌స్టంట్ ఇన్‌కమ్, ట్రేడింగ్ ప్రాఫిట్, క్రిప్టో రిటర్న్స్, టాస్క్ కంప్లీట్ చేసి డబ్బు సంపాదించండి అంటూ వచ్చే ప్రతి ఆఫర్ నిజం కాదు. ముఖ్యంగా డిజిటల్ అరెస్ట్ పేరుతో పోలీసులు, కస్టమ్స్, కొరియర్ అధికారులు అంటూ వీడియో కాల్స్ చేసి డబ్బులు అడిగితే వెంటనే అప్రమత్తం కావాలి.

యూపీలో ఘోర రోడ్డు ప్రమాదం

యూపీఈఐడీఏ భద్రతా సిబ్బంది, స్థానిక పోలీసులు అతికష్టం మీద వెలికితీశారు. ఈ ఘటనలో దేవరియాకు చెందిన నిత్యా ప్రజాపతి (22), ఇర్ఫాన్ అన్సారీ (20), అనికేత్ (24) మృతి చెందారు. ఆనంద్ యాదవ్ (23), రాజు (22), జయంత్ శర్మ (30) తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను తొలుత స్థానిక ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అయోధ్యలోని దర్శన్ నగర్ మెడికల్ కాలేజీకి తరలించారు. ప్రస్తుతం వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో తామందరం నిద్రలోఉన్నామని, అసలేం జరిగిందో కూడా తెలియలేదని గాయపడిన జయంత్ పోలీసులకు చెప్పాడు. ప్రమాదం జరిగిన వెంటనే ట్రక్కు డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసిదర్యాప్తుప్రారంభించారు.పరారీలోఉన్న ట్రక్కుడ్రైవర్‌నుగుర్తించేందుకు గాలింపు చర్యలు చేపట్టారు..

యూపీ పీసీసీ అధ్యక్షురాలిగా ఆరాధన మిశ్రా

కాంగ్రెస్ ఇటువంటి వ్యూహాన్నే అనుసరించింది. అప్పటి ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ సూచన మేరకు, బ్రాహ్మణ సామాజికవర్గానికి చెందిన షీలా దీక్షిత్‌ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా రంగంలోకి దింపింది. రాష్ట్ర జనాభాలో దాదాపు 10 నుంచి 12 శాతం ఉన్న బ్రాహ్మణ ఓటర్లను ప్రసన్నం చేసుకుంటే పార్టీకి పూర్వవైభవం లభిస్తుందని అప్పట్లో అంచనా వేసింది. అయితే, ఆ ప్రయోగం ఆశించిన ఫలితాలను ఇవ్వకపోగా, తీవ్రంగా బెడిసికొట్టడంతో కాంగ్రెస్ కేవలం ఏడు స్థానాలకే పరిమితం కావాల్సి వచ్చింది. ప్రస్తుతం మరోసారి అదే బాటలో పయనిస్తున్న కాంగ్రెస్‌కు, ఈసారి మిత్రపక్షమైన సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) నుంచే సవాళ్లు ఎదురయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ తన 'పీడీఏ' (పిచ్‌డా, దళిత్, అల్పసంఖ్యాక్) నినాదాన్ని మరింత విస్తృతం చేశారు. పీడీఏలోని 'పి' అంటే 'పండిట్' (బ్రాహ్మణులు) అని కూడా అర్థం చెబుతూ ఆ సామాజికవర్గ ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. బీజేపీ ప్రభుత్వం బ్రాహ్మణులను విస్మరిస్తోందని ఆయన నిరంతరం విమర్శలు గుప్పిస్తున్నారు.

పెట్టుబడులను ఆకర్షించేందుకు చర్యలు

ఆదేశించారు. పెట్టుబడుల ప్రతిపా దనలను వేగంగా పరిశీలించి, వివిధ శాఖల మధ్య సమ న్వయంతో నిర్ణీత కాలవ్యవధిలో కార్యరూపం దాల్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తెలంగాణ రైజింగ్ లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్రాన్ని పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి కల్పనలో అగ్రగామిగా నిలిపేందుకు ఇన్వెస్ట్ తెలంగాణ కీలక వేదికగా పనిచేయాలని సీఎస్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, శశాంక, అనుదీప్, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ, ఎండీ, అజిత్ రెడ్డి, నిఖిల్ చక్రవర్తి, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

మోదీ 25 ఏళ్ల పాలనా ప్రస్థానం భారత రాజకీయాల్లో నవశకం





హైదరాబాద్, అక్టోబర్ 07 : ప్రధాని మోదీ 25 ఏళ్ల పాలనా ప్రస్థానం భారత రాజకీయాల్లో నవశకమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి అన్నారు. ప్రధాని ప్రజాజీవితంలో 25ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నగరంలోని పాత గంజ్‌లో 'వికసిత్ భారత్' కార్యక్రమాన్ని నిర్వహించారు.బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులా చారి మాట్లాడుతూ.. నరేంద్ర మోదీ 25 ఏళ్ల పరిపాలనా ప్రస్థానం భారతదేశ రాజకీయ చరిత్రలో ఒక నవశకానికి నాంది పలికిందని కొనియాడారు. జీవితంలో ఎన్నడూ బ్యాంకు గుమ్మం తొక్కని కోట్లాది మంది నిరుపేదలకు జన్ ధన్ ఖాతాలు తెరిపించి దేశ ఆర్థిక వ్యవస్థలో భాగస్వా ములను చేశారన్నారు. కట్టెల పొయ్యి పొగతో అనారోగ్యం బారిన పడుతున్న కోట్లాది మంది పేద తల్లులు, అక్కాచెల్లె ళ్లకు 'ఉజ్వల' గ్యాస్ కనెక్షన్లు అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపారని పేర్కొన్నారు. 'పీఎం ఆవాస్ యోజన' ద్వారా ప్రతి పేదవాడి సొంతింటి కలను నిజం చేయడంతో పాటు, 'పీఎం కిసాన్ సమ్మాన్ నిధి' ద్వారా నేరుగా అన్నదా తల ఖాతాల్లో పెట్టుబడి సాయాన్ని జమ చేస్తున్నారు.

మోదీ ఆధ్వర్యంలోనే సర్జికల్ స్ట్రైక్స్..

గతంలో ఉగ్రవాదులు దాడులు చేస్తే శాంతి చర్చల పేరిట కాలయాపన చేసేవారని, కాని మోదీ నాయకత్వంలో సరిహద్దులు దాటి సర్జికల్ స్ట్రైక్స్, బాలాకోట్ ఎయిర్ స్ట్రైక్స్‌తో ఉగ్రవాద స్థావరాలను మట్టుబెట్టిన బలమైన సైనిక సత్తాను ప్రపంచానికి చాటామని దినేష్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సమగ్ర అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని, రాష్ట్రంలో ఎటువంటి అవినీతి లేని పారదర్శక డబుల్ ఇంజిన్ పాలన తీసుకురావడానికి ప్రజలు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరారు. 'సేవా సంకల్ప్ అభియాన్' -- 'ఆంగన్ మిలన్ సేవ' కార్యక్రమంలో భాగంగా ఇందూర్ అర్బన్ నియోజకవర్గంలోని అంగన్‌వాడీ టీచర్‌లకు దినేష్ పటేల్ కులాచారి, పల్లె గంగారెడ్డి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు మారెడ్డి వనిత ఆధ్వర్యంలో సన్మానించి అభినందనలు తెలియజేశారు. జాతీయ పసుపు బోర్డు ఛైర్మన్ పల్లె గంగారెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచంలోనే ఏ నాయకుడికి సాధ్యం కాని రీతిలో అలుపెరుగని ప్రజాసేవ చేస్తున్న ఏకైక కర్మయోగి నరేంద్ర మోదీ అన్నారు. ఈ కార్యక్రమంలో గద్దె భూమన్న, కంచెట్టి గంగాధర్, భారత్ రెడ్డి, నాగోళ్ల లక్ష్మీ నారాయణ, నిమ్మల శ్రీనివాస్, ప్రమోద్ కుమార్, జ్యోతి, న్యాలం రాజు, రాంచందర్, సురేంధర్, బొబ్బిలి వేణు, విజయ్ కృష్ణ, ఓం సింగ్, పిల్లి శ్రీకాంత్, వంశీ గౌడ్, మారెడ్డి వనిత తదితరులు పాల్గొన్నారు.

బెంగళూరులో పేలిన ట్రాన్స్‌ఫార్మర్!

అమెజాన్ ఆఫీస్ సమీపంలో పేలుడు



బెంగళూరు, అక్టోబర్ 07 : బెంగళూరులో ఉదయం తీవ్ర కలకలం రేగింది. అమెజాన్ కార్యాల యం సమీపంలో ఉన్న ఒక విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఒక్కసారిగా పేలిపోయింది. ఈ ప్రమాదంలో ఫుట్‌పాత్‌పై నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తి గాయపడగా, స్థానికులు భయాందోళన లతో పరుగులు తీశారు. బాగలూరు క్రాస్ వద్ద ఉదయం 9:30 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. మహమ్మద్ అఫ్రోజ్ అనే వ్యక్తి ఫుట్‌పాత్‌పై నడుస్తుండగా, సమీపంలోని విద్యుత్ రింగ్ మెయిన్ యూనిట్ (ఆర్ఎంయూ) భారీ శబ్దం తో పేలింది. ఈ ధాటికి అఫ్రోజ్ కిందపడిపోగా, వెంటనే స్పందించిన స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాధితుడు క్షేమంగా ఉన్నాడని, ప్రాణాపా యం తప్పిందని అధికారులు వెల్లడించారు. ఈ ఘటన యలహంక ఓల్డ్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఈ ప్రమాదంపై బెంగళూరు విద్యుత్ సరఫరా కంపెనీ (బెస్కాం) అధికారులు స్పందించారు. మీడియం-వోల్టేజ్ పవర్ డిస్ట్రిబ్యూ షన్ నెట్‌వర్క్‌లోని భాగమైన రింగ్ మెయిన్ యూని ట్‌లో సాంకేతిక లోపం తలెత్తిందని, ఇలాంటి పేలు ళ్లు చాలా అరుదుగా సంభవిస్తాయని తెలిపారు. తమ సాంకేతిక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు వివరించారు. ఈ ప్రమాదంతో ఆ ప్రాంతంలో కొంతసేపు గందరగోళ వాతావరణం నెలకొంది.

వరంగల్‌లో మైనర్ల హల్‌చల్

- **తల్వార్‌తో బైక్‌పై తిరుగుతున్న యువకులు**

వరంగల్, అక్టోబర్ 07 : నగరంలో ఆకతాయిల ఆగడాలు కలవరపెడుతున్నాయి. తాజాగా నలు గురు మైనర్లు ఒకే బైక్‌పై తిరుగుతూ.. చేతిలో తల్వార్‌తో హల్‌చల్ చేసిన ఘటన కలకలం రేపింది. కరీమాబాద్‌లోని వీరన్నగుడి ప్రాంతంలో తెల్లవారుజామున ఈ ఘటన జరిగినట్లు తెలు స్తోంది. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.వీరన్నగుడి ప్రాంతంలో నలుగురు యువకులు ఒకే బైక్‌పై తిరుగుతూ హడావుడి చేసినట్లు వైరల్ అవుతున్న వీడియోలో కనిపిస్తోంది. వారిలో ఓ వ్యక్తి చేతిలో తల్వార్ పట్టు కుని ఉన్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా.. తమ ను చూసి మొరుగుతున్న వీధికుక్కలపై తల్వార్‌తో దాడికి యత్నించినట్లు వీడియోలో ఉన్న దృశ్యాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో స్థానికుల్లో భయాం దోళన వ్యక్తమవుతోంది. ఘటనపై పోలీసులు దృష్టి సారించి.. వీడియోలో కనిపిస్తున్న యువకులు ఎవరనే దానిపై ఆరా తీస్తున్నారు. వారు మైనర్లేనా? ఈ తరహా ఘటనలకు గతంలోనూ పాల్పడ్డారా? అనే కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నారు. వరంగల్ నగరంలో ఆకతాయిలు, పోకిరీల దౌర్జన్యాలకు సంబంధించిన ఘటనలు గతంలోనూ వెలుగుచూశాయి. ఇటీవల ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్న కొందరు యువకులను ఓ వ్యక్తి ప్రశ్నించడంతో.. అతడిపై నడిరోడ్డుపై దాడి చేసిన ఘటన కలకలం రేపింది. ఈ ఘటనకు సంబంధించిన సీసీటీవీ దృశ్యాలు వెలుగులోకి రావడంతో పోలీసులు చర్య లు చేపట్టారు. తాజాగా తల్వార్‌తో మైనర్లు హల్ చల్ చేసిన ఘటన వెలుగులోకి రావడంతో నగరం లో యువత ప్రవర్తనపై మరోసారి చర్చ మొదలైం ది. శివనగర్, కరీమాబాద్, శాకరాసికుంట, శంభు నిపేట, రంగశాయిపేట తదితర ప్రాంతాల్లో ఆకతా యిల వేధింపులు, హల్‌చల్‌పై పోలీసులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. మైనర్ల కదలికలపై తల్లిదండ్రులు ప్రత్యేకంగా దృష్టి పెట్టా లని పోలీసులు సూచిస్తున్నారు. సరదా, జల్సాల పేరుతో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు. వైరల్ వీడియో ఆధారంగా పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

మోదీ ప్రస్థానంపై ముస్లిం జమాత్ అధ్యక్షుడి ప్రశంసలు



న్యూఢిల్లీ, అక్టోబర్ 07 : ప్రధాని నరేంద్ర మోదీ నేతృ త్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఎటువంటి వివక్ష లేకుండా సమా జంలోని అన్ని వర్గాలకు లబ్ధి చేకూరుస్తున్నాయని అఖిల భారత ముస్లిం జమాత్ అధ్యక్షుడు మౌలానా ముఫ్తీ షహబుద్దీన్ రజ్వీ బరేల్వీ కొనియాడారు. పరిపాలనా రంగంలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్న ప్రధాని మోదీకి ఆయన అభినందనలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు దేశంలోని ముస్లింలకు కూడా సమర్థవంతంగా అందుతున్నా యని ఆయన స్పష్టం చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ, "ఆయుష్మాన్ భారత్, పీఎం ఆవాస్ యో జన, ఉజ్వల యోజన వంటి కేంద్ర ప్రభుత్వ పథకాలు ఎలాంటి వివక్షకు తావులేకుండా పౌరుల అందరికీ మేలు చేస్తున్నాయి. ప్రభుత్వ పథకాల ద్వారా ముస్లింలకు ప్రయోజనం చేకూరడం లేదని కొందరు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవి" అని రజ్వీ పేర్కొన్నారు. "ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద నిర్మించిన ఇళ్లలో నిరుపేద ముస్లింలు కూడా లబ్ధి పొందారు. అదేవిధంగా రైతు సంక్షేమ పథకాల్లోనూ హిందూ, ముస్లిం అనే భేదం లేకుండా అర్హులైన పేద రైతులందరికీ సాయం అందుతోంది. పౌరుల భద్రతను పర్యవేక్షించడం, వారి ఆర్థిక ఇబ్బందులను తొలగించడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత. ప్రధాని మోదీ ఆ బాధ్యతను అత్యంత సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారు" అని ఆయన కొనియాడారు. ఇదే క్రమంలో, జునా అఖాడాకు చెందిన ఆచార్య మహామండలేశ్వర్ స్వామి అవధేశానంద గిరి సైతం ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై ప్రశంసలు కురిపించారు.

కాలిఫోర్నియాలో భారీ ఫ్రాడ్ కేసు కలకలం

నేరం అంగీకరించిన నాటా మాజీ అధ్యక్షుడు

కాలిఫోర్నియా, అక్టోబర్ 07 : అమెరికాలోని నార్త్‌ర్న్ కాలిఫోర్నియాలో భారీ ఫ్రాడ్ కేసు కలకలం రేపింది. నార్త్ అమెరికన్ తెలుగు అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ రాఘవరెడ్డి గోసల నేరం అంగీకరించారు. చారిటబుల్ మ్యాచింగ్ ప్రోగ్రామ్‌లను మోసగించడం, ట్యాక్స్ రిటర్న్‌లను తప్పుగా చూపించడం లాంటి వ్యవహారాల్లో ఆయన ఫెడరల్ కోర్టులో తప్పు ఒప్పుకున్నారు. వైర్ ఫ్రాడ్, అమెరికా ప్రభుత్వాన్ని మోసగించే కుట్ర చేశారని ఆయనపై అభియోగాలు నమోదయ్యాయి. లాభాపేక్ష లేని సంస్థను అడ్డం పెట్టుకుని ఆయన ఈ మోసానికి పాల్పడ్డారు. నాటా సంస్థ పేరుతో దేశవ్యాప్తంగా ఉన్న వివిధ యజమానుల నుంచి మిలియన్ల కొద్దీ డాలర్ల ఫ్రాడ్ విరాళాలను ఆయన సేకరించారు. ఈ వ్యవహారానికి సంబంధించి పెన్సిల్వేనియాలోని నార్త్ వేల్స్‌కు చెందిన 65 ఏళ్ల రాఘవరెడ్డి గోసల పై 2026 మే 5న కేసు నమోదు అయింది. ఫెడరల్ కోర్టులో విచారణ జరగ్గా తనపై మోపిన అభియోగాలన్నింటినీ ప్లీ అగ్రిమెంట్ కింద ఆయన అంగీకరించారు.ఈ కేసును అసిస్టెంట్ యూఎస్ అటార్నీ మైఖేల్ జి. పిట్‌మాన్, సాహిబ్ కౌర్ సహాయంతో వాదిస్తున్నారు.

ఈశాన్య ఢిల్లీలో కుప్పకూలిన 5 అంతస్తుల భవనం

ఇళ్ల నుంచి రోడ్లపైకి పరుగులు తీసిన ప్రజలు

శిథిలాల తొలగింపు చర్యలను వేగవంతం

శిథిలాల నుంచి నలుగురిని కాపాడిన స్థానికులు

న్యూఢిల్లీ, అక్టోబర్ 07 : దేశ రాజధాని ఢిల్లీలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఈశాన్య ఢిల్లీలోని సీమాపురి ప్రాంతంలో బుధవారం మధ్యాహ్నం ఓ ఐదు అంతస్తుల భవనం పేకమేడలా కుప్పకూలింది. కళ్లముందే భారీ భవనం నేలమట్టం కావడంతో ఆ ప్రాంతంలో తీవ్ర భయాందోళనలు, హాహాకారాలు చెలరేగాయి. భారీ ఎత్తున శబ్దం రావడంతో స్థానికులు భయంతో ఇళ్ల నుంచి రోడ్లపైకి పరుగులు తీశారు. బుధవారం మధ్యాహ్నం సుమారు 3:15 గంటల సమయంలో భవనం కూలిపోయినట్లు ఫైర్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందింది. సమాచారం అందిన వెంటనే ఢిల్లీ అగ్నిమాపక సిబ్బంది, స్థానిక పోలీసులు, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ బృందాలు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నాయి. శిథిలాల తొలగింపు చర్యలను వేగవంతం చేశాయి. జిల్లా డీసీపీ ఆర్తి బీనా స్వయంగా ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు.ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి సహాయక చర్యల్లో పాలుపంచుకున్నారు. శిథిలాల కింద చిక్కుకున్న ఇద్దరు చిన్నారులతో సహా మొత్తం నలుగురిని బయటకు తీశారు. తీవ్రంగా గాయపడిన వారిని వెంటనే సమీపంలోని రాజీవ్ గాంధీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించి అత్యవసర చికిత్స అందిస్తున్నారు. అయితే భవన యజమానితో పాటు ఒకే కుటుంబా నికి చెందిన సుమారు ఆరుగురు వ్యక్తులు ఇంకా శిథిలాల కిందే చిక్కుకుని ఉన్నట్లు తెలుస్తోంది. శిథిలాల కింద ఊపిరాడక అల్లాడు

బలగం TV BALAGAM

balagamtv100@gmail.com

అనుభవమే గొప్ప ఆస్తి

సంపాదకీయం

సీఎం, పీఎంగా 25 ఏళ్ల అధికార ప్రస్థానం పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రధాని మోదీ తన రాజకీయ జీవితం, వ్యక్తిగత అనుభవాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ, తన జీవితంలోని ప్రతి క్షణం, ప్రతి సంఘటన తనకు ఎన్నో విలువైన పాఠాలు నేర్పించాయని తెలిపారు. సాధించిన ప్రతి విజయం తనను మరింత ఉన్నత లక్ష్యాల వైపు నడిపించిందని అన్నారు. ప్రధాని మోదీ మాట్లాడుతూ, "దేశం నాకు ఎంతో ఇచ్చింది, కాబట్టి దేశం పట్ల నా బాధ్యత చాలా ఎక్కువ ఉంది. నాపై ప్రజలకే అత్యధిక హక్కు ఉంది. ఈ 25 ఏళ్ల అనుభవమే నా గొప్ప ఆస్తి. ఈ ఆస్తి మోదీకి కాదు, దేశానికి చెందుతుంది. మాతృభూమిలోని ప్రతి బిడ్డకు దానిపై హక్కు ఉంది" అని అన్నారు. తన చిన్నతనం రోజులను గుర్తు చేసు కుంటూ, గుజరాత్‌లోని వడ్నగర్‌ను ప్రస్తావించారు ప్రధాని మోదీ. తాను ఎప్పుడూ పాఠశాలకు అందరి కంటే ముందుగా వచ్చే విద్యార్థులలో ఒకడినని తెలిపారు. నేర్చుకోవాలనే తపన తన జీవితంలో ఒక భాగమని, నేటికీ తాను ఎప్పుడూ ఒక విద్యార్థిగానే భావిస్తానని పేర్కొన్నారు. తన చదువు, నేర్చుకునే తపన ఎన్నటికీ తగ్గకూడదని దేవుడిని ప్రార్థించినట్లు వెల్లడించారు. జీవితంలో ఎదురైన కష్టాల నుంచి తాను ఎంతో నేర్చుకున్నానని చెబుతూ, "నన్ను కించ పరిచిన వారు నాకు కోసం తిరిగి నిలబడటం నేర్పిం చారు. నన్ను వ్యతిరేకించిన వారు ప్రజాస్వామ్య శక్తిని నేర్పించారు. ప్రతి సంక్షోభం నా సహనానికి ఒక పరీక్షగా నిలిచింది" అని అన్నారు. బాధ్యతలను ఒక లక్ష్యంగా మార్చుకున్నామని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. కార్యాచరణే తన మతమని, భగవద్గీత బోధించిన 'కర్మణ్యే వాధికారస్తే' మార్గంలోనే నడుస్తున్నానని చెప్పారు. తాను ఎప్పుడూ కీర్తి ప్రతిష్టల గురించి పట్టించుకోలేదని, కేవలం దేశం కోసం పని చేయడమే తన కర్తవ్యమని ఆయన స్పష్టం చేశారు. 25 ఏళ్లు పూర్తి చేసుకున్న ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. పాతికేళ్ల పాటు ప్రభుత్వం అధినేతగా కొనసాగుతానని తాను అసలు ఊహించలేదని, తన కెరీర్ ఇలా సాగుతుందని అసలు ఊహించలేదు అన్నారు. "దేశం నాకు చాలా ఇచ్చింది. అందుకే దేశం పట్ల నా బాధ్యత అందరికంటే ఎక్కువగా ఉంటుంది. భారత్‌లోని ప్రతి పౌరుడికీ నాపై అత్యంత హక్కు ఉందని నేను హృదయపూర్వకంగా నమ్ముతున్నాను" అన్నారు. ప్రధానమంత్రి మాట్లాడుతూ, "నేను దేశప్రజలందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నాను. 7 అక్టోబర్ 2001న గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినప్పుడు, ఎప్పటికైనా ఈ ఘట్టం వస్తుందని అనుకోలేదు. ఈరోజు ప్రభుత్వ అధినేతగా నిరంతరం సేవ చేస్తూ నేను 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్నాను. ఇది ప్రజల నిరంతర ఆశీర్వాదాల ఫలితం. బీజేపీ, ఎన్డీఏ, ప్రజాస్వామ్యం పట్ల గౌరవం ఉన్న రాజకీయ సహచరులందరికీ నేను కృతజ్ఞతలు తెలుపుతున్నాను. నేను దేశ ప్రజల పాదాలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను" అన్నారు. మరోవైపు 25 ఏళ్ల సుదీర్ఘ కాలంపాటు ప్రభుత్వ అధినేతగా పనిచేసిన ప్రధాని మోదీ నాయకత్వాన్ని కేంద్ర కేబినెట్ మంగళవారం ప్రశంసించింది. తొలుత గుజరాత్ ముఖ్యమంత్రిగా, ఆ తర్వాత భారత ప్రధానమంత్రిగా ఆయన చేసిన సేవలను కొనియాడింది. 'దేశమే ప్రథమం, పౌరుడే తొలి ప్రాధాన్యం' అనే సూత్రంతో ముందుకు వెళ్తున్నారని పేర్కొంది. విశేష జనాదరణ పొందుతూ మూడు లోక్‌సభ ఎన్నికల్లోనూ వరుసగా విజయాలు సాధించారని గుర్తు చేస్తూ, ఈ మేరకు కేంద్ర కేబినెట్ ఓ తీర్మానాన్ని ఆమోదించింది. గుజరాత్ ముఖ్యమంత్రిగా వరుసగా మూడుసార్లు సేవలందించిన సమయంలో మోదీ పలు విజయవంతమైన కార్యక్రమాలను చేపట్టారని కేబినెట్ పేర్కొంది. గుజరాత్‌లో అమలు చేసిన పథకాల స్ఫూర్తితో దేశవ్యాప్తంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూ దార్శనికతతో ముందుకు సాగుతున్నారని తెలిపింది. చిన్నతనంలో తన తల్లి ఎదుర్కొన్న ఇబ్బందికర పరిస్థితులను, దేశంలో పేదరికాన్ని స్వయంగా చూసిన అనుభవం మోదీ విధానాలపై ప్రభావం చూపిందని పేర్కొంది. ఆ అనుభవాలతో ప్రభుత్వ స్థాయిలో చర్యలు తీసుకుంటున్నారని తెలిపింది. మహిళలు, రైతులు, యువతకు అవకాశాలను విస్తరించేందుకు మోదీ ప్రభుత్వం కృషి చేస్తోందని కేబినెట్ పేర్కొంది. దేశ అభివృద్ధికి అవసరమైన సంస్కరణలను ధైర్యంగా చేపడుతున్నారని తెలిపింది. మోదీ నాయకత్వంలో మూలధన వ్యయం రూ.12 లక్షల కోట్లకు పెరిగిందని వెల్లడించింది. హైవేల విస్తరణ, రైల్వేల ఆధునికీకరణ వేగంగా జరుగుతున్నాయని పేర్కొంది. అలాగే మోదీ పాలనలో డిజిటల్ సేవల్లోనూ విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయని కేబినెట్ తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా అనేక సవాళ్లు, అనిశ్చిత పరిస్థితులు నెలకొన్న సమయంలోనూ తన నాయకత్వ సామర్థ్యంతో దేశాన్ని సరైన దిశలో ముందుకు తీసుకెళ్తున్నారని పేర్కొంది. అంతర్జాతీయ వేదికలపై భారత్‌కు ప్రాధాన్యం మరింత పెరుగుతోందని తెలిపింది. దేశ భద్రత విషయంలోనూ ప్రధాని మోదీ రాజీపడని వైఖరిని అవలంబిస్తున్నారని కేబినెట్ తీర్మానంలో పేర్కొంది. సర్జికల్ స్ట్రైక్స్, బాలాకోట్ వైమానిక దాడులు, ఆపరేషన్ సిందూర్ వంటి చర్యలు ఇందుకు నిదర్శనమని తెలిపింది. 2047 నాటికి సుసంపన్న, అభివృద్ధి చెందిన భారత్‌ను నిర్మించాలన్న ప్రధాని మోదీ దార్శనికతకు మద్దతుగా నిలుస్తూ తీర్మానాన్ని ఆమోదిస్తున్నట్లు కేబినెట్ వెల్లడించింది. ఇదిలా ఉండగా, ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్ట్, లాజిస్టిక్స్ అథారిటీ ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రవాణా రంగంలో పరిశోధన, అభివృద్ధి ప్రాజెక్టుల పర్యవేక్షణలో ఈ సంస్థ కీలకంగా వ్యవహరించనుందని కేంద్ర ఐటీ, సమాచారశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. వివిధ మంత్రిత్వ శాఖలు, ఏజెన్సీల మధ్య సమన్వయ లోపాలను తగ్గించి మౌలిక సదుపాయాల కల్పనలో వేగం పెంచేలా ఇట్లా పనిచేస్తుందని ఆయన వివరించారు. రూ.500 కోట్లకు పైగా వ్యయంతో చేపట్టే మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల సాంకేతిక



అర్హతలను ఇట్లా మదింపు చేస్తుందని తెలిపారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమల్లో ఈక్విటీ పెట్టుబడులు పెట్టేందుకు వీలుగా రూ.10 వేల కోట్లతో ప్రత్యేక నిధి ఏర్పాటు చేసే ప్రతిపాదనకూ కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ గ్రోత్ ఫండ్ ద్వారా ఎంఎస్ ఎంఈ లకు దీర్ఘకాలంలో అవసరమైన పెట్టుబడులు అందుబాటులోకి వస్తాయని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. దీంతో చిన్న, మధ్యతరహా పరిశ్రమలు తమ వ్యాపార కార్యకలాపాలను విస్తరించుకోవడంతో పాటు నూతన సాంకేతికతను అందిపుచ్చుకునేందుకు అవకాశం కలుగుతుందని చెప్పారు. మొత్తంగా ప్రధాని మోదీ నాయకత్వంపై ప్రశంసలు కురిపిస్తూ కేబినెట్ తీర్మానం చేయడంతో పాటు రవాణా మౌలిక సదుపాయాలు, లాజిస్టిక్స్ రంగంలో సమన్వయం, ఎంఎస్ ఎంఈలకు పెట్టుబడుల లభ్యతను పెంచే కీలక నిర్ణయాలను సమావేశంలో తీసుకుంది.

దసరా పండుగకు 7 వేల ప్రత్యేక బస్సులు..

తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ కీలక నిర్ణయం!

ప్రత్యేక బస్సుల ఛార్జీలలో మార్పు



హైదరాబాద్, అక్టోబర్ 07 : దసరా పండుగ నేపథ్యంలో సొంతూళ్లకు వెళ్లే వారిని క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేసేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీజీఎస్ఆర్టీసీ) పూర్తి స్థాయిలో సన్నద్ధమైంది. ఈ పండుగకు 7 వేల ప్రత్యేక బస్సులను నడపాలని యాజమాన్యం నిర్ణయించింది.ఇందులో భాగంగా కరీంనగర్ జోన్ నుంచి మొత్తం 3533 బస్సులు నడుపుతోంది. రీజియన్ల వారిగా ఆదిలాబాద్ 431, నిజామాబాద్ 719, కరీంనగర్ 1175, వరంగల్ 530, ఖమ్మం 678, హైదరాబాద్ జోన్ నుంచి 2155 బస్సులు నడుపుతుండగా రీజియన్ల వారిగా మహబూబ్ నగర్ 645, మెదక్ 255 , నల్గొండ 815, రంగారెడ్డి 440. అలాగే గ్రేటర్ హైదరాబాద్ జోన్ నుంచి 1312 దసరా పండగ కు ప్రత్యేక సర్వీసు లను నడపాలని టీజీఎస్ ఆర్టీసీ నిర్ణయించింది. ప్రధానంగా ఈ నెల 9,10,16, 17 తేదీల్లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఆయా రోజుల్లో రద్దీ మేరకు ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచేలా టీజీఎస్ ఆర్టీసీ యాజమాన్యం ప్లాన్ చేసింది. అలాగే, ఈ నెల 25, 26 తేదీల్లో తిరుగు ప్రయాణ రద్దీకి సంబంధించి తగిన ఏర్పాట్లు చేసింది. హైదరాబాద్ లో రద్దీ ప్రాంతాలైన ఎంజీబీఎస్, జేబీఎస్, ఉప్పల్ (నల్ల చెరువు) , ఆరాంఘర్, ఎల్బీనగర్ క్రాస్ రోడ్స్, కేపీహెచ్బీ, బోయిన్పల్లి, గచ్చిబౌలి తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను సంస్థ నడుపుతోంది. ఆయా ప్రాంతాల్లో ప్రయాణికుల సౌకర్యార్థం పండల్స్, షామియానాలు, కుర్చీలు, పబ్లిక్ అడ్రస్ సిస్టం, తాగునీటి సదుపాయం, మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేయనుంది. ప్రధాన పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో ప్రజలకు రవాణా పరంగా ఇబ్బందులు తలెత్తకుండా వారిని క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేసేందుకు స్పెషల్ సర్వీసు లను ఆర్టీసీ యాజమాన్యం నడుపుతోంది. తిరుగు ప్రయాణంలో స్పెషల్ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ ఏమాత్రం లేనప్పటికీ రద్దీ ఉన్న రూట్లలో ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా ఉండేం దుకు ఖాళీ బస్సులను త్వరతగతిన సంస్థ వెనక్కి తెప్పిస్తుంది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా వాటిని ఆయా రూట్లలో నడిపిస్తుంది. ఆ స్పెషల్ బస్సులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చులు, నిర్వహణ మేరకు టికెట్ ధరను సవరించుకోవాలని 2003లో జీవో నంబర్ 16 ను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో నడిచే స్పెషల్ బస్సుల్లో మాత్రమే 1.5 వరకు టికెట్ ధరలను సవరించుకునే వెసులుబాటును సంస్థకు ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం ప్రతి ప్రధాన పండుగకు 1.5 వరకు టికెట్ ధరలను ఉమ్మడి కార్పొరేషన్గా ఉన్నప్పటి నుండి అమలు చేస్తుంది. టీజీఎస్ఆర్టీసీ ఏర్పడిన నాటి నుండి ప్రతి ప్రధాన పండుగకు దీన్ని అమలు చేస్తుంది.ఈ దసరా పండుగకు నడిపే ప్రత్యేక బస్సులకు రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం 1.5 వరకు టికెట్ ధరలను టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం సవరించింది. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాలకు తిరిగే స్పెషల్ బస్సులకు మాత్రమే సవరించిన చార్జీలు వర్తిస్తాయి. ఈ నెల 9, 10,16,17 తేదీలతో పాటు తిరుగు ప్రయాణ రద్దీ ఎక్కువగా ఉండే 25,26 తేదీల్లో మాత్రమే సవరించిన చార్జీలు అమల్లో ఉంటాయి. స్పెషల్ బస్సులు మినహా రెగ్యులర్ బస్సుల్లో సాధారణ చార్జీలే అమల్లో ఉంటాయి. రాష్ట్ర ప్రభుత్వ మహాలక్ష్మి పథకంలో భాగంగా దసరా కు నడిపే పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్, సిటీ ఆర్డినరి, మెట్రో ఎక్స్ ప్రెస్ రెగ్యులర్ , స్పెషల్ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు రవాణా సదుపాయం యథావిధిగా అమల్లో ఉంటుందని టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి స్పష్టం చేశారు. టీజీఎస్ఆర్టీసీ బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్ ను వెబ్ సైట్ లో బుక్ చేసుకోవాలని యాజమాన్యం తెలిపింది. దసరా కు స్వంత ఊర్లకు వెళ్లే ప్రయా ణీకులు ప్రత్యేక బస్సులకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033 లలో సంప్రదించాలని యాజమాన్యం సూచించింది.

సీఎం చంద్రబాబును కలిసిన ఏషియన్ గేమ్స్ విజేతలు



అమరావతి, అక్టోబర్ 07 : 2026 ఆసియా క్రీడల్లో అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్రానికి పతకాలు సాధించిన క్రీడాకారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఘనంగా సత్కరించారు. నేడు అమరా వతిలోని రాష్ట్ర సచివాలయంలో విజేతలు ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. అంతర్జా తీయ వేదికపై ఆంధ్రప్రదేశ్ కీర్తిని చాటిచెప్పినం దుకు వారిని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ప్రశంసించారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో క్రికెటర్ శ్రీచరణి, అర్చర్లు గణేశ్ మణిరత్నం, ధీరజ్ బొమ్మదేవర, వెన్నం జ్యోతిసురేఖ ఉన్నారు. భవిష్యత్తులోనూ మరిన్ని విజయాలు సాధించి అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని సీఎం ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర క్రీడాకారులు సాధించిన పతకాల వివరాలను శాప్ ఎండీ భరణి ముఖ్యమంత్రికి వివరించారు. మూడు వేర్వేరు క్రీడాంశాల్లో మన అథ్లెట్లు 3 స్వర్ణాలు, 2 రజతాలు, 3 కాంస్యాలతో కలిపి మొత్తం 8 పతకాలను గెలుచుకున్నారని ఆయన తెలిపారు.

ఈ విజయాల స్ఫూర్తితో భవిష్యత్తులో రాష్ట్రం నుంచి మరింత మంది క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు ప్రభుత్వం అండగా ఉంటుం దని చంద్రబాబు హామీ ఇచ్చారు. క్రీడాకా రులకు అవసరమైన అన్ని రకాల ప్రోత్సాహ కాలతో పాటు, అత్యుత్తమ మౌలిక సదుపా యాలు కల్పిస్తామని ఆయన స్పష్టం చేశారు.

అమెరికాలో 40 మంది పౌరసత్వం రద్దు..

జాబితాలో పలువురు భారతీయులు!

న్యూఢిల్లీ, అక్టోబర్ 07 :అమెరికా ప్రభుత్వం పౌరసత్వం విషయంలో కీలక చర్యలు చేపట్టింది. తప్పుడు వివరాలు ఇచ్చి లేదా తమ గతాన్ని దాచిపెట్టి అమెరికా పౌరసత్వం పొందినట్లు ఆరోప ణలు ఎదుర్కొంటున్న 40 మందిపై పౌరసత్వం రద్దు చేసేందుకు న్యాయపరమైన ప్రక్రియను ప్రారంభించింది. వీరిలో భారతీయుడు కూడా ఉన్నారు. అమెరికా ఆధునిక చరిత్రలో ఇదే అతిపెద్ద 'డీ-న్యాచురలైజేషన్' చర్యగా న్యాయశాఖ పేర్కొంది. అమెరికా పౌరసత్వాన్ని మోసం, చట్టవిరుద్ధ మార్గాల ద్వారా పొందిన వారిపై చర్యలు తీసుకునే విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని దీంతో స్పష్టమవుతోంది. ఆగస్టు 21 నుంచి అక్టోబర్ 2 మధ్య దేశంలోని 19 ఫెడరల్ డిస్ట్రిక్ట్ కోర్టుల్లో ఈ 40 మందిపై సివిల్ కేసులు దాఖలయ్యాయి. వీరిలో కొందరు తీవ్రమైన నేరాలకు పాల్పడ్డారని ఆరోపణలు ఉన్నాయి. మరికొందరు పౌరసత్వం కోసం దరఖాస్తు చేసిన సమయంలో తమకు సంబంధించిన ముఖ్యమైన వివరాలను దాచిపెట్టారని, తప్పుడు సమాచారం ఇచ్చారని అధికారులు చెబుతున్నారు. గూఢచర్యం నుంచి లైంగిక నేరాల వరకు వివిధ తీవ్రమైన కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న కొందరు తమ గతాన్ని దాచిపెట్టి పౌరసత్వం పొందారని అమెరికా అటార్నీ జనరల్ టాడ్ బ్లాంచ్ తెలిపారు. పౌరసత్వం పొందే ప్రక్రియలో మోసాలను సహించబోమని స్పష్టం చేశారు. అమెరికా అధికారుల ప్రకారం బల్విందర్ సింగ్ రెండు వేర్వేరు గుర్తింపులను ఉపయోగించినట్లు ఆరోపణలు ఉన్నాయి. 1992లో ఒక గుర్తింపుతో ఇమ్మిగ్రేషన్ కోసం దరఖాస్తు చేసుకున్న ఆయన 2003లో మరో గుర్తింపుతో శాశ్వత నివాస హోదా (పర్మినెంట్ రెసిడెంట్) పొందినట్లు అధికారులు చెబుతున్నారు. ఆ తర్వాత 2009లో అదే రెండో గుర్తింపుతో అమెరికా పౌరసత్వం పొందినట్లు ఆరోపణలు ఉన్నా యి. అయితే రెండు వేర్వేరు దరఖాస్తుల్లో నమోదైన వేలిముద్రలను పరిశీలించిన అధికారులు అవి ఒకే వ్యక్తివని గుర్తించినట్లు న్యాయశాఖ తెలిపింది. ఈ జాబితాలో అమెరికా నౌకాదళ మాజీ సైనికుడు జిన్‌చావో వీ కూడా ఉన్నారు. చైనాకు గూఢచర్యం చేశారనే ఆరోపణలతో ఆయన ప్రస్తుతం 200 నెలల జైలు శిక్ష అనుభవిస్తున్నారు. మిగతా వ్యక్తులపై హత్య, మనీ లాండరింగ్, లైంగిక నేరాలు, పన్ను ఎగవేత, వివాహ మోసం వంటి పలు ఆరోపణలు ఉన్నట్లు న్యాయశాఖ తెలిపింది. ఈ 40 మందిలో ఒక్క దేశానికి చెందిన వారు మాత్రమే లేరు. మెక్సికో, పాకిస్థాన్, చైనా, నేపాల్, ఇరాన్, నైజీరియా సహా 20కి పైగా దేశాలకు చెందిన వ్యక్తులు ఉన్నట్లు అమెరికా న్యాయశాఖ తెలిపింది.

ఇన్‌స్టాలా మారిపోతున్న ఫేస్‌బుక్..

హైదరాబాద్, అక్టోబర్ 07 : సామాజిక మాధ్యమ దిగ్గజం ఫేస్‌బుక్ తన రూపురేఖ లను మార్చుకునే దిశగా అడుగులు వేస్తోంది. ఇప్పటివరకు స్నేహితుల పోస్టులు, ఫొటోలు, వీడియోలు, వివిధ రకా ల సమాచారం ప్రధానంగా కనిపించేలా ఉన్న ఫేస్‌బుక్ యాప్ ఇకపై ఇన్‌స్టాగ్రామ్ తరహాలో మరింత వీడియో కేంద్రంగా మారనుంది. యాప్‌ను తెరవగానే పూర్తి తెరపై చిన్న వీడియోలు కనిపించేలా కొత్త రూపకల్పనను తీసుకొచ్చి ంది. ప్రస్తుతం ఫేస్‌బుక్‌ను తెరిచినప్పుడు వినియోగ దారులు తమ స్నేహితుల పోస్టులు, పేజీల సమాచారం, వివిధ రకాల ప్రచురణ లను ప్రధాన తెరపైనే చూడగలుగుతున్నారు. అయితే కొత్త మార్పులతో యాప్‌ను తెరిచిన వెంటనే చిన్న వీడియోలకు ప్రాధాన్యం లభించనుంది. పూర్తి తెరను ఆక్రమించే విధంగా వీడియోలు కనిపించడంతో వినియో గదారుల అనుభవం ఇన్‌స్టాగ్రామ్‌లోని చిన్న వీడియోల అనుభవాన్ని పోలి ఉండనుంది. వినియోగదారుల అభిరుచుల్లో వస్తున్న మార్పు లను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకు న్నట్లు మెటా సంస్థ భావిస్తోంది. ప్రస్తుతం చాలామంది వినియోగదారులు సుదీర్ఘమైన వచన పోస్టుల కంటే చిన్న వీడియోలు, దృశ్యరూపంలో ఉండే సమాచారాన్ని ఎక్కువగా



ఇష్టపడుతున్నారు. ముఖ్యంగా తక్కువ సమయంలో ఎక్కువ సమాచారాన్ని అందించే చిన్న వీడియోలకు సామాజిక మాధ్యమాల్లో విపరీతమైన ఆదరణ లభిస్తోంది. ఈ నేపథ్యంలో ఫేస్‌బుక్‌ను కూడా మరింత దృశ్య, వీడియో ఆధారిత వేదికగా మార్చే ప్రయత్నం జరుగుతోంది.కొత్త రూపకల్పనలో ఫేస్‌బుక్ తెరిచిన వెంటనే చిన్న వీడియోలు వరుసగా కనిపించను న్నాయి. వినియోగదారులు ఒక వీడియోను చూసిన తర్వాత పైకి లేదా కిందకు జరుపుతూ మరో వీడియోకు వెళ్లే అవకాశం ఉంటుంది. ఈ విధానం ఇప్పటికే ఇన్‌స్టాగ్రా మ్‌లోని చిన్న వీడియోల విభాగంలో ప్రాచుర్యం పొందింది. అదే తరహా అనుభవా న్ని ఫేస్‌బుక్‌లోనూ అందించేందుకు సంస్థ ప్రయత్నిస్తోంది.అయితే స్నేహితులు పెట్టే సాధారణ పోస్టులకు ప్రాధాన్యం తగ్గిపోతుందా అనే సందేహాలు కూడా వినియోగదారుల్లో వ్యక్తమవుతున్నాయి. కొత్త రూపకల్పనలో స్నేహితుల పోస్టులను చూడాలంటే ప్రత్యేకం గా రెండో ట్యాబ్‌ను తెరవాల్సి ఉంటుంది. అంటే యాప్ ప్రధాన తెరపైకి వచ్చిన వెంటనే ముందుగా కనిపించేది స్నేహితుల పోస్టులు కాకుండా చిన్న వీడియోలు. స్నేహితులు, కుటుంబ సభ్యులు, పరిచయస్తుల పోస్టులను చూడాలనుకునే వారు ప్రత్యేక విభాగానికి వెళ్లాల్సి ఉంటుంది.ఈ కొత్త ఫీచర్‌ను తొలుత భారత్‌లో అందుబాటులోకి తీసుకురావడం కూడా ఆసక్తికరంగా మారింది. భారతదేశంలో చిన్న వీడియోలకు ఉన్న ఆదరణ, భారీ సంఖ్యలో ఉన్న సామాజిక మాధ్యమ వినియో గదారుల నేపథ్యంలో ఈ మార్పును ముందు గా ఇక్కడ పరీక్షిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ప్రస్తుతం ఈ కొత్త రూపకల్పన అందరు వినియోగదారులకు అందుబాటులోకి రాలేదు. కొంతమంది వినియోగదారులకు మాత్రమే ప్రయోగాత్మకంగా ఈ మార్పును అందిస్తు న్నారు.కొత్త రూపకల్పనపై వినియోగదారుల స్పందనను పరిశీలించిన తర్వాత మరింత విస్తృతంగా అందుబాటులోకి తీసుకురావడంపై సంస్థ నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. వినియోగదారులు చిన్న వీడియోలను ఎంతగా చూస్తున్నారు, కొత్త రూపకల్పనతో వారు యాప్‌లో ఎంత సమయం గడుపుతున్నారు, స్నేహితుల పోస్టుల కోసం ప్రత్యేక ట్యాబ్‌ను ఎంతమేర ఉపయోగిస్తున్నారు వంటి అంశాలను సంస్థ పరిశీలించే అవకాశం ఉంది.ఫేస్‌బుక్‌కు ఇది ఒక ముఖ్యమైన మార్పుగా భావించవచ్చు. ఒకప్పుడు స్నేహితుల పోస్టులు, ఫొటోలు, వ్యక్తిగత సమాచారం పంచుకోవడానికి ప్రధాన వేదికగా ఉన్న ఫేస్‌బుక్.. ఇప్పుడు వీడియో కంటెంట్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తోంది. సామాజిక మాధ్యమాల్లో వీడియోల ఆధిపత్యం పెరుగుతున్న నేపథ్యంలో వినియోగదారుల దృష్టిని ఎక్కువసేపు తమ వేదికపై ఉంచేందుకు ఈ తరహా మార్పులు ఉపయోగపడతాయని సంస్థ భావిస్తోం ది.మొత్తంగా చూస్తే ఫేస్‌బుక్ వినియోగ అనుభవం త్వరలోనే గణనీయంగా మారే అవకాశం కనిపిస్తోంది. యాప్ తెరవగానే చిన్న వీడియోలు కనిపించడం, స్నేహితుల పోస్టుల కోసం ప్రత్యేక ట్యాబ్‌కు వెళ్లాల్సి రావడం వంటి మార్పులు వినియోగదారులకు కొత్త అనుభూతిని ఇవ్వనున్నాయి.

అందుబాటులో ఉండాలి.. మెరుగైన వైద్యం అందించాలి..

- కలెక్టర్ గరిమ అగ్రవాల్

బలగం టీవీ,వేములవాడ:

వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని, మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.వేములవాడ మండలం హనుమాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ని జిల్లా కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి రోజు ఓపీకి ఎంత మంది వస్తారని వైద్య సిబ్బందిని ఆరా తీశారు.ఆరోగ్య కేంద్రంలో ఓపీ రిజిస్టర్, ల్యాబ్, ఇమ్యూనైజేషన్ గది, ఇన్ పేషెంట్ గదులు, ఇతర గదులు, ఫార్మసీ, ఆసుపత్రి ఆవరణలో పరిశీలించారు.

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ఆరోగ్య కేంద్రంలో ఉన్న ఏ.ఎన్.ఎం. లతో మాట్లాడి క్షేత్ర స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని, ఏ.ఎన్.సీ రిజిస్ట్రేషన్లు, గర్భిణుల ఆరోగ్య విషయాలపై దృష్టి సారించి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెంచేలా కృషి చేయాలని సూచించారు.

ఎన్.సీ.డీ స్క్రీనింగ్ పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. దీని ద్వారా ముందు గానే వ్యాధి లక్షణాలను గుర్తించి, అవసరమైన చికిత్స అందించడానికి ఆస్కారం ఉంటుందని పేర్కొన్నారు. ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలని, మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు,



పరిసరాల పరిశుభ్రతపై వివరించాలని తెలిపారు. ప్రసవాల సంఖ్యపై ఆరా తీశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని ఆదేశించారు. ఆసుపత్రి ఆవరణం, పరిసరాలు శుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలని ఆదేశించారు.

మున్సిపల్ కార్మికుల పెండింగ్ జీతాలు చెల్లించాలి..



-లేకుంటే మున్సిపల్ కార్యాలయం ముట్టడిస్తాం

వేములవాడ బీజేపీ నేతలు

బలగం టీవీ,వేములవాడ:

బతుకమ్మ, దసరా పండుగల వేళ కూడా పారిశుద్ధ్య కార్మికులకు పెండింగ్ వేతనాలు, దసరా బోనస్, పండుగ కానుకలు అందకపోవడంపై వేములవాడ బీజేపీ నేతలు మున్సిపల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో రెండు, మూడు రోజుల్లో కార్మికులకు రావాల్సిన బకాయిలన్నీ చెల్లించాలని డిమాండ్ చేశారు. స్పందించకపోతే మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా, నిరసన చేపట్టి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

వేములవాడ బీజేపీ పట్టణ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్, కౌన్సిలర్ కుమ్మరి శంకర్ లు వేములవాడ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకమని, నిత్యం ప్రజల ఆరోగ్యం కోసం పనిచేసే కార్మికులకు పండుగ సమయంలోనూ వేతనాలు అందకపోవడం బాధాకరమన్నారు.

గత జులై నుంచి కార్మికులకు రావాల్సిన వేతనాలు నిలిచిపోయాయని, దసరా సందర్భంగా ఏటా అందించే దుస్తులు, చెప్పులు, నూనె, సబ్బులు, సర్ఫు తదితర నిత్యావసర వస్తువులను కూడా గత ఏడాది నుంచి అందించలేదని పేర్కొన్నారు. దీంతో పండుగ వేళ కుటుంబాలను పోషించుకునేందుకు కార్మికులు అధిక వడ్డీలకు అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.

మున్సిపల్ కౌన్సిల్‌లో కార్మికులకు బీమా సౌకర్యం కల్పించాలని తీర్మానాలు చేసినప్పటికీ అమలులో మాత్రం పక్షపాతం చూపుతున్నారని, అవుట్‌సోర్సింగ్ సిబ్బందితో సహా మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులందరికీ సమానంగా ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.స్థానిక ఎమ్మెల్యే నిధులు లేదా మున్సిపల్ సాధారణ నిధుల నుంచి అవసరమైన నిధులు సమకూర్చి పెండింగ్ వేతనాలు, దసరా బోనస్, పండుగ కానుకలను వెంటనే విడుదల చేయాలని కోరారు. రెండు, మూడు రోజుల్లో సమస్య పరిష్కారం కాకపోతే కార్మికులతో కలిసి మున్సిపల్ కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహించి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల కమిషన్ నిష్పక్షపాతంగా వ్యవహరించాలి

-భూ రికార్డులపై సమగ్ర సర్వే నిర్వహించాలి

-కేసీఆర్ ఫామ్‌హౌస్ భూములపై

సీఎం స్పష్టత ఇవ్వాలి..

-చాడ వెంకటరెడ్డి

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :

ఎన్నికలు ప్రజాస్వామ్యానికి ఆయువుపట్టని, ఎన్నికల కమిషన్ నిష్పక్షపాతంగా, రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాలని సీపీఐ జాతీయ నాయకుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. బుధవారం సిరిసిల్లలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ

రాష్ట్రవ్యాప్తంగా భూ రికార్డుల్లో అవకతవకలు ఉన్నాయన్న ఆరోపణల నేపథ్యంలో సర్వే నంబర్ల వారీగా సమగ్ర భూ సర్వే నిర్వహించాలని డిమాండ్ చేశారు. గ్రామసభల ద్వారా భూముల హద్దులను గుర్తించి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కమిటీలు ఎందుకు విఫలమవుతున్నాయని ప్రశ్నించారు.కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు సంబంధించిన భూముల వివరాలపై ముఖ్యమంత్రి స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముస్తాబాద్ మండలంలో భూ సమస్యపై వచ్చిన వినతిని ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, బాధితుడికి న్యాయం జరగకపోతే సమస్య పరిష్కారమయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని



హెచ్చరించారు.

ఎన్నికల కమిషన్ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కనుసన్నల్లో పనిచేస్తోందని ఆరోపించారు. పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగించడం ప్రజాస్వామ్యంపై ప్రభావం చూపిందని, ఓటర్ల నమోదు ప్రక్రియ పారదర్శకంగా సాగాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం ప్రభుత్వ బాధ్యతని అన్నారు. ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

రాజ్యాంగబద్ధ సంస్థలు స్వతంత్రంగా పనిచేసినప్పుడే ప్రజాస్వామ్య వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని అన్నారు. భూ సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి, మంత్రులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. సమావేశంలో సీపీఐ నాయకులు పంతం రవి, గుంటి వేణు, కడారి రాములు, మంద అనిల్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ రాజ్యాధికారమే టీఆర్పీ లక్ష్యం



రాజ్యాధికార పార్టీలోకి 40 మంది చేరిక

-టిఆర్పి స్టేట్ మీడియా కోఆర్డినేటర్ గీస మధు యాదవ్

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :

బీసీ రాజ్యాధికార సాధనే లక్ష్యంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ ముందుకు సాగుతోందని టిఆర్పి స్టేట్ మీడియా కోఆర్డినేటర్ గీస మధు యాదవ్ అన్నారు. తంగళ్లపల్లి మండలం చీర్లవంచ గ్రామానికి చెందిన లక్కపాక రాకేష్ ఆధ్వర్యంలో సుమారు 40 మంది మహిళలు, యువకులు బుధవారం పార్టీలో చేరారు. జిల్లా అధ్యక్షుడు దండు వినోద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గీస మధు యాదవ్ వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.ఈ సందర్భంగా గీస మధు యాదవ్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు బీసీలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని అన్నారు . ప్రభుత్వాలు మారుతున్నా బీసీల పరిస్థితుల్లో ఆశించిన మార్పు రావడం లేదని, బీసీలకు న్యాయం జరగాలంటే రాజకీయ అధికారం సాధించడమే ఏకైక మార్గమని అన్నారు. తీన్మార్ మల్లన్న నాయకత్వంలో బీసీ రాజ్యాధికార ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు తీన్మార్ మల్లన్న బీసీ రాజ్యాధికార లక్ష్యంతో చేపట్టిన 14,500 కిలోమీటర్ల బీసీ రాజ్యాధికార పాదయాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని తెలిపారు. బీసీలకు రాజకీయ ప్రాధాన్యం, అధికారంలో భాగస్వామ్యం కల్పించాలన్న మల్లన్న సంకల్పానికి ఆకర్షితులై యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పార్టీలో చేరుతున్నారని పేర్కొన్నారు.

జిల్లా అధ్యక్షుడు దండు వినోద్ మాట్లాడుతూ బీసీ వర్గాలకు చెందిన యువత, మహిళలు రాజకీయంగా ఏకతాటిపైకి రావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. వివిధ పార్టీల్లో ఉన్న బీసీ నాయకులు కూడా తమ రాజకీయ భవిష్యత్తును బీసీ రాజ్యాధికార సాధనతో ముడిపెట్టుకుని తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు కలికోట రేణుక, పట్టణ అధ్యక్షుడు అరకాల రమేష్, ప్రధాన కార్యదర్శి చెట్టిపల్లి నరేందర్, మహిళా అధ్యక్షురాలు బిట్ల జోష్ణ, జిల్లా కమిటీ సభ్యుడు గుండేటి చంద్రశేఖర్, సామాజిక మాధ్యమాల సమన్వయకర్త అవధూత వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూటీఎస్ జిల్లా నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

పీఆర్‌టీయూటీఎస్ రాజన్న సిరిసిల్ల జిల్లా శాఖ సర్వసభ్య సమావేశం జిల్లా అధ్యక్షులు గన్నమనేని శ్రీనివాసరావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల కిషన్ వార్షిక నివేదికను సమర్పించారు. అనంతరం అన్ని మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నివేదికపై సమగ్రంగా చర్చించి, సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు పుల్గం దామోదర్ రెడ్డి మాట్లాడుతూ.. DSC-2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అతి త్వరలో అమల్లోకి వచ్చేలా కృషి చేస్తామని తెలిపారు. CPS విధానాన్ని రద్దు చేసే అంశంపై సంబంధిత కమిటీకి ఉద్యోగుల సమస్యలను సమగ్రంగా వివరించి, పాత పెన్షన్ విధానం కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు. ఇటీవల నూతనంగా అమల్లోకి వచ్చిన Employees Health Scheme (EHS) లో ఉన్న పరిపాలనా, సాంకేతిక సమస్యలను పరిష్కరించి, పథకాన్ని విజయవంతంగా అమలు చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రాథమిక పాఠశాలల్లో జీవో నం.25ను సవరించిన అనంతరమే వేసవి కాలంలో ప్రమోషన్లు, బదిలీలు చేపట్టేలా చూస్తామని హామీ ఇచ్చారు. విద్యాశాఖలో ప్రమోషన్లు ఆలస్యంగా జరుగుతున్న నేపథ్యంలో ఉపాధ్యాయులకు ప్రయోజనం కలిగే విధంగా ఆటోమెటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్‌ను 5, 10, 15, 20, 25, 30 సంవత్సరాలకు అమలు చేయాలని PRC కమిషన్‌కు ప్రతిపాదనలు సమర్పించినట్లు తెలిపారు.



అదేవిధంగా ఉపాధ్యాయులందరూ పోటీతత్వంతో పనిచేస్తూ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలని రాష్ట్ర అధ్యక్షులు పిలుపునిచ్చారు.

ఐదేళ్లలోపు చిన్నారులకు ఆధార్ నమోదు

గోదావరిఖనిలో ప్రత్యేక శిబిరం ప్రారంభం

బలగం టీవీ, గోదావరిఖని

గోదావరిఖని నగరంలోని విఠల్‌నగర్ ఐసీడీఎస్ కార్యాలయంలో ఐదేళ్లలోపు చిన్నారులకు ఆధార్ నమోదు ప్రత్యేక శిబిరం బుధవారం ప్రారంభమైంది. పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశాల మేరకు చిన్నారులకు ఆధార్ నమోదు సులభతరం చేసేందుకు బుధ, గురువారాల్లో రెండు రోజులపాటు ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నారు.

మొదటి రోజు ఆధార్ నమోదు ప్రక్రియ విజయవంతంగా నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. చిన్నారుల తల్లిదండ్రులు, సంరక్షకులు శిబిరానికి హాజరై ఆధార్ నమోదు సేవలను వినియోగించుకున్నారు. గురువారం కూడా శిబిరం కొనసాగుతుందని అధికారులు పేర్కొన్నారు.

రామగుండం పరిధిలోని అర్హులైన చిన్నారుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ పిల్లలకు ఆధార్ నమోదు చేయించాలని సూచించారు. భవిష్యత్తులో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, విద్య, ఇతర అవసరాలకు ఆధార్ సేవలు అందుబాటులో ఉండేలా ఈ ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.



యూనియన్ల పేరుతో బ్లాక్‌మెయిల్ రాజకీయాలా..?

-కాలనీతో సంబంధం లేనివారికి బహిష్కరణ హక్కెక్కడిది?

-జర్నలిస్టు హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు దాసరి దేవేందర్

బలగం టీవీ,వేములవాడ :

యూనియన్ల పేరుతో బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేస్తూ జర్నలిస్టుల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నాలను సహించబోమని వేములవాడ జర్నలిస్టు హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు దాసరి దేవేందర్ హెచ్చరించారు. వేములవాడ లో జర్నలిస్టు కాలనీలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, తదుపరి చర్యలపై హౌసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం సమావేశం నిర్వహించారు.పలు అంశాలపై చర్చించి తీర్మానాలు ఆమోదించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు దాసరి దేవేందర్ మాట్లాడుతూ వేములవాడ మున్సిపాలిటీ నాంపల్లి పరిధిలోని జర్నలిస్టు కాలనీని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సందర్శించే కార్యక్రమాన్ని కొంతమంది బహిష్కరిస్తున్నట్లు సామాజిక మాధ్యమాల్లో చేస్తున్న ప్రచారన్ని . ఎమ్మెల్యే కాలనీ సందర్శన కార్యక్రమం వ్యక్తిగతమైనది కాదని, ఏ ఒక్క యూనియన్‌కు సంబంధించినది కూడా కాదని, కాలనీలో పట్టాలు పొందిన ప్రతి జర్నలిస్టు కార్యక్రమంలో పాల్గొనాల్సి ఉండగా, రాజకీయ కారణాలతో కొంతమంది దూరంగా ఉంటున్నట్లు ప్రకటించుకోవడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని అన్నారు.తమను తాము యూనియన్ నాయకులుగా ప్రకటించుకుంటున్న కొంతమంది వ్యక్తులకు జర్నలిస్టు కాలనీతో సంబంధం లేదని పేర్కొన్నారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా చెప్పుకుంటున్న కొలిపాక నర్సయ్య కి ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఇంటి పట్టా మంజూరు కాలేదని అన్నారు. అయినప్పటికీ మరో వ్యక్తికి చెందిన స్థలంలో ఆయన ఇంటి నిర్మాణం చేపట్టినట్లు తమకు సమాచారం ఉందని, ఈ వ్యవహారంపై అధికారులు సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

మరో హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడిగా చెప్పుకుంటున్న నాయకుడు తనకు మంజూరైన పట్టాను కుటుంబ సభ్యుల పేరుతో మార్పించినట్లు ప్రాథమిక సమాచారం ఉందని తెలిపారు. ఈ వ్యవహారంపైనా నిబంధనల మేరకు విచారణ జరిపించాలని జిల్లా కలెక్టర్‌ను కోరనున్నట్లు తెలిపారు .మీడియా రంగంతో సంబంధం లేని వ్యక్తులను వెంట పెట్టుకుని తిరుగుతూ కేవలం తమ ఉనికిని చాటుకునేందుకు విమర్శలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. జర్నలిస్టు కాలనీలో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి కోసం యూనియన్లకు అతీతంగా అందరూ కలిసి పనిచేయాలని కోరారు.ఈ సమావేశంలో సొసైటీ ప్రధాన కార్యదర్శి ఎన్.టి. బాబు యాదవ్, ఉపాధ్యక్షుడు తుమ్మనపల్లి జనార్ధన్, గౌరవ సలహాదారు రాపల్లి శ్రీనివాస్, కోశాధికారి దూలం రఘు, సంయుక్త కార్యదర్శి అమరగొండ కిషన్, నిర్వహణ కార్యదర్శి నూగూరి మహేష్, సభ్యులు పాల్గొన్నారు.



బంగారు పోచమ్మ ఆలయంలో విగ్రహం మాయం

అమ్మవారి విగ్రహంతో పాటు పలు వస్తువులు అదృశ్యం.. దర్యాప్తు చేయాలని స్థానికుల డిమాండ్

బలగం టీవీ, జగిత్యాల

జగిత్యాల జిల్లా మల్యాల మండల కేంద్రంలోని కొత్తపేట సమీప బంగారు పోచమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహంతో పాటు పలు వస్తువులు మాయమైన ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. మంగళవారం రాత్రి ఆలయంలోని విగ్రహంతో పాటు రెండు గంగిరెద్దుల మట్టి విగ్రహాలు, నైవేద్య కుండలు, విగ్రహం కింద ఉన్న పెద్ద రాయి కనిపించకుండా పోయాయి.

ప్రతిరోజూ ఆలయాన్ని శుభ్రం చేసే భక్తుడు బుధవారం ఉదయం ఆలయానికి వెళ్లగా విగ్రహం, ఇతర వస్తువులు కనిపించకపోవడంతో స్థానికులకు సమాచారం అందించారు. 100 ఏళ్లకు పైగా చరిత్ర ఉన్న ఆలయంలో ఈ ఘటన జరగడంతో భక్తులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు, సంబంధిత అధికారులు దర్యాప్తు చేపట్టి విగ్రహం మాయమైన ఘటనకు కారణాలను వెలికితీయాలని కోరుతున్నారు.



ఘనంగా సిరిసిల్లలో వికసిత్ భారత్ సంకల్ప సభ..

-సిరిసిల్లలో సేవా జ్యోతి యాత్ర.. భారీగా బీజేపీ శ్రేణుల ర్యాలీ

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 76వ జన్మదినం, ఆయన 25 ఏళ్ల ప్రజా సేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో 'వికసిత్ భారత్ సంకల్ప సభ–సేవా జ్యోతి యాత్ర'ను ఘనంగా నిర్వహించారు. సిరిసిల్ల పాత బస్టాండ్ సమీపంలోని అమరవీరుల స్థూపం వద్ద ఏర్పాటు చేసిన తెరపై ప్రధాని మోదీ దేశవ్యాప్తంగా బీజేపీ కార్యకర్తలను ఉద్దేశించి చేసిన ప్రసంగాన్ని జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి, జిల్లా ఇన్‌చార్జి గంగాడి మోహన్‌రెడ్డి తదితరులు వీక్షించారు. అనంతరం సేవా జ్యోతి యాత్రను ప్రారంభించారు. రథంపై జ్యోతిని వెలిగించగా, చేనేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్ కాగడాను వెలిగించి పెద్దిరెడ్డికి అందజేశారు.అనంతరం పాత బస్టాండ్ నుంచి అంబేద్కర్ చౌరస్తా మీదుగా గాంధీచౌక్ వరకు బీజేపీ జెండాలతో భారీ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి మాట్లాడుతూ ప్రధాని మోదీ ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా 25 ఏళ్లుగా ప్రజలకు అంకితభావంతో సేవలందిస్తున్నారని అన్నారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో కోట్లాది మంది ప్రజలు పేదరికం నుంచి బయటపడుతున్నారని పేర్కొన్నారు. తెలంగాణలో గత పాలకుల నిర్లక్ష్యంతో రాష్ట్రం అప్పుల భారంలో కూరుకుపోయిందని అన్నారు . ప్రాజెక్టులు, విద్యుత్, తాగునీరు తదితర సమస్యలతో రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.తెలంగాణలో మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తోందని తెలిపారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే తెలంగాణతో పాటు చేనేత రంగానికి మరింత ప్రోత్సాహం లభిస్తుందని అన్నారు.

సేవా భావాన్ని విస్తరించాలి: పెద్దిరెడ్డి

మాజీ మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ, సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా బీజేపీ కార్యకర్తలు చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. మోదీ ప్రజా సేవా ప్రస్థానాన్ని స్ఫూర్తిగా తీసుకుని సేవా భావాన్ని ప్రజల్లో మరింత విస్తరించాలని సూచించారు. సేవా జ్యోతి యాత్ర ద్వారా సమాజహితం, దేశాభివృద్ధిపై ప్రజల్లో చైతన్యం కలగాలని ఆకాంక్షించారు.

కార్యకర్తలకు మోదీ ప్రస్థానం స్ఫూర్తిదాయకం: మోహన్‌రెడ్డి

బీజేపీ జిల్లా ఇన్‌చార్జి గంగాడి మోహన్‌రెడ్డి మాట్లాడుతూ, మోదీ 25 ఏళ్ల ప్రజా సేవా ప్రస్థానం ప్రతి కార్యకర్తకు స్ఫూర్తిదాయకమన్నారు. పార్టీ శ్రేణులు ప్రజలతో మమేకమై నిరంతరం సేవా కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు.ఈ

కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా పదాధికారులు, వివిధ మోర్చాల నాయకులు, మండల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, యువమోర్చా, మహిళా మోర్చా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సరఫరా వ్యవస్థల పరిరక్షణ, వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిపై విదేశాంగ మంత్రి జైశంకర్ స్పష్టత!



బలగం టీవీ, హైదరాబాద్

నేటి సంక్షోభ పూరిత ప్రపంచంలో ఇంధనం, ఆహారం, ఎరువులు మరియు ఆర్థిక రంగాలకు సంబంధించి బలమైన, సురక్షితమైన సరఫరా వ్యవస్థల (సప్లై చైన్) అవసరం ఎంతైనా ఉందని భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ స్పష్టం చేశారు. ఘనాలోని ఫోరిన్ సర్వీస్ ఇన్‌స్టిట్యూట్‌లో జరిగిన కార్యక్రమంలో 'భారత్, ఆఫ్రికా మరియు గ్లోబల్ సౌత్' అంశంపై ఆయన ప్రసంగించారు. గ్లోబల్ సౌత్ దేశాలకు పారిశ్రామికంగా ఎదిగే సంపూర్ణ హక్కు ఉందని, భారత విదేశాంగ విధానం వ్యూహాత్మక స్వయంప్రతిపత్తితో నడుస్తోందని ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

మూడు ఆఫ్రికా దేశాల (ఘనా, ఐవరీ కోస్ట్, ఇథియోపియా) పర్యటనలో భాగంగా ప్రస్తుతం ఘనాలో ఉన్న జైశంకర్, నేటి దౌత్య విధానం వివాదాలకు తావులేకుండా నడవాలని పేర్కొన్నారు. ప్రయోజనాలు విభిన్నంగా ఉన్నప్పటికీ సహకారాన్ని పెంపొందించుకోవడమే నిజమైన దౌత్యమని అన్నారు. డిజిటల్ వ్యవస్థ, తయారీ రంగం, మౌలిక సదుపాయాలు మరియు ఆర్థిక వ్యవస్థలో భారత్ సాధిస్తున్న మార్పులు ప్రపంచ వృద్ధికి ప్రధాన ఇంజిన్‌గా మారుతున్నాయని ఆయన కొనియాడారు. సాంకేతిక పరిజ్ఞానం, సరఫరా వ్యవస్థల భద్రతే జాతీయ భద్రతకు పునాది అని స్పష్టం చేశారు.

అలాగే ఆఫ్రికా దేశాలతో తమ భాగస్వామ్యం కేవలం తాత్కాలికం కాదని, రాబోయే తరాలకు ఉపయోగపడేలా సుదీర్ఘకాలం కొనసాగుతుందని చెప్పారు. భారత జీ20 అధ్యక్షతన ఆఫ్రికన్ యూనియన్‌ను జీ20 కూటమిలో చేర్చడాన్ని ఈ సందర్భంగా గుర్తుచేస్తూ, గ్లోబల్ సౌత్ స్వరానికి భారత్ ఎల్లప్పుడూ మద్దతుగా నిలుస్తుందని తెలిపారు. పర్యటనలో భాగంగా అక్రాలోని భారత సంతతి ప్రజలతో కూడా ఆయన సమావేశమయ్యారు.

నల్లసముద్రంలో ఆయిల్ ట్యాంకర్‌పై ఉక్రెయిన్ డ్రోన్ దాడి

23 మంది భారతీయ సిబ్బంది సురక్షితం!


బలగం టీవీ, మాస్కో

నల్లసముద్రం (Black Sea) తీరంలో రష్యాలోని సోచి (Sochi) నగర సమీపంలో ప్రయాణిస్తున్న ఒక ఆయిల్ ట్యాంకర్‌పై ఉక్రెయిన్ నావికాదళ డ్రోన్ దాడి చేసింది. ఈ దాడి కారణంగా లైబీరియా పతాకంతో ప్రయాణిస్తున్న 'అఫ్రామాక్స్ రియో' (Aframax Rio) అనే ఆయిల్ ట్యాంకర్‌లో భారీ ఎత్తున మంటలు చెలరేగాయి. అయితే, ఆ నౌకలో ఉన్న 23 మంది భారతీయ సిబ్బందిని రక్షణ బృందాలు సురక్షితంగా రక్షించాయి.

మంట తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఆరంభంలో అగ్నిమాపక బృందాలు మంటలను అదుపు చేయలేకపోయాయని, సముద్రంలో ముడిచమురు బహిరంగంగా కాలుతోందని రష్యా రవాణా మంత్రిత్వ శాఖ తెలిపింది. మంటల తీవ్రత తగ్గిన తర్వాత సహాయక చర్యలను పునరుద్ధరించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. నల్లసముద్రంలో చమురు లీకేజీ మరియు కాలుష్యం ముప్పును దృష్టిలో ఉంచుకుని సోచి నగరం మరియు సమీపంలోని సిరియస్ ప్రాంతాల్లో సముద్ర తీరాలు, బీచ్‌లను అధికారులు తాత్కాలికంగా మూసివేశారు.

పెరుగుతున్న నల్లసముద్ర ఉద్రిక్తతలు:

రష్యా-ఉక్రెయిన్ మధ్య ఘర్షణలు తీవ్రరూపం దాల్చుతున్న నేపథ్యంలో రెండు దేశాలు వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకుని





దాడులకు పాల్పడుతున్నాయి. ఈ ఘటనకు సరిగ్గా ఒక రోజు ముందు రొమేనియా తీరంలో మరొక నౌకపై దాడి జరగగా, అందులో ఒక భారతీయ సిబ్బంది గాయపడగా ఒకరు మరణించారు. వాణిజ్య నౌకలు మరియు నావికులపై జరుగుతున్న దాడుల పట్ల భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ (MEA) తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, వివాదాల నివారణకు చర్చలు మరియు దౌత్య మార్గమే సరైనదని స్పష్టం చేసింది.

ఉక్రెయిన్‌పై రష్యా భారీ దాడి



24 మంది మృతి.. 60 మందికి గాయాలు

బలగం టీవీ, మాస్కో

ఉక్రెయిన్‌లోని కీవ్‌తో పాటు పలు ప్రాంతాలపై రష్యా బుధవారం తెల్లవారుజామున క్షిపణులు, డ్రోన్లతో భారీ దాడులకు పాల్పడింది. ఈ దాడుల్లో నలుగురు చిన్నారులు సహా కనీసం 24 మంది మృతి చెందగా, సుమారు 60 మంది గాయపడ్డారని ఉక్రెయిన్ అధికారులు తెలిపారు.

చెర్నిహివ్ ప్రాంతంలోని ప్రిలుకీ నగరంలో రష్యా క్షిపణి అపార్ట్‌మెంట్ భవనాన్ని ధ్వంసం చేయడంతో నలుగురు చిన్నారులు సహా 18 మంది మృతి చెందారు. మృతుల్లో ఏడాది వయసున్న ముగ్గురు చిన్నారులు, ఎనిమిదేళ్ల బాలుడు ఉన్నారని అధ్యక్షుడు జెలెన్‌స్కీ తెలిపారు. క్రీమెన్‌చుక్‌లో ఇద్దరు మృతి చెందగా, ఏడుగురు గాయపడ్డారు.

రష్యా భారీ దాడికి సన్నాహాలు చేస్తున్నట్లు ముందుగానే తమ నిఘా వర్గాలు హెచ్చరించినప్పటికీ, దాడులను పూర్తిగా అడ్డుకోలేకపోయామని జెలెన్‌స్కీ పేర్కొన్నారు. రష్యా బాలిస్టిక్ క్షిపణులను ఎదుర్కోవడంలో ఉక్రెయిన్ వైమానిక రక్షణ వ్యవస్థలకు తీవ్ర సవాళ్లు ఎదురవుతున్నాయని తెలిపారు. పేట్రియాట్ క్షిపణులు అత్యవసరంగా అవసరమని చెప్పారు.

మరోవైపు ఉక్రెయిన్ కూడా రష్యాలోని చమురు శుద్ధి కేంద్రాలు, నిల్వ కేంద్రాలపై డ్రోన్లు, క్షిపణులతో దాడులు చేసినట్లు జెలెన్‌స్కీ వెల్లడించారు. అయితే ఈ దాడులకు సంబంధించిన కొన్ని వివరాలను స్వతంత్రంగా నిర్ధారించడం సాధ్యం కాలేదు.

కొత్త రంగాలకు భారత్-ఘనా సమగ్ర భాగస్వామ్యం విస్తరణ

విదేశాంగ మంత్రి జైశంకర్!

బలగం టీవీ, అక్రా (ఘనా)

భారత్, ఘనాల నడుమ ఉన్న సమగ్ర భాగస్వామ్యాన్ని (Comprehensive Partnership) మరింత బలోపేతం చేసుకుంటూ ఫార్మాస్యూటికల్స్, ఆరోగ్యం, గనుల త్రవ్వకం, రక్షణ, రైల్వేలు మరియు డిజిటల్ వంటి రంగాలకు విస్తరించాలని నిర్ణయించినట్లు భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ వెల్లడించారు. మూడు ఆఫ్రికా దేశాల పర్యటనలో భాగంగా ఘనా చేరుకున్న ఆయన, ఆ దేశ విదేశాంగ మంత్రి శామ్ ఒకుడ్జెటో అబ్లాక్వాతో విస్తృత స్థాయి చర్చలు జరిపారు. జూలై 2025లో భారత ప్రధాని నరేంద్ర మోదీ ఘనా పర్యటన సందర్భంగా ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలను సమగ్ర భాగస్వామ్య స్థాయికి పెంచిన విషయాన్ని గుర్తుచేస్తూ, ఆ భాగస్వామ్య లక్ష్యాలను అందుకునేందుకు మరిన్ని రంగాల్లో కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఘనా కీలక నిర్ణయాన్ని వెల్లడిస్తూ తమ దేశ క్యాబినెట్ 'బ్రిక్స్' (BRICS) కూటమిలో సభ్యత్వం కోసం దరఖాస్తు చేసుకోవాలని నిర్ణయించినట్లు విదేశాంగ మంత్రి అబ్లాక్వా ప్రకటించారు. ఐఎంఎఫ్, వరల్డ్ బ్యాంక్ వంటి సాంప్రదాయ భాగస్వాములను వీడకుండానే అంతర్జాతీయంగా తమ భాగస్వామ్యాలను విస్తరించుకోవడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఘనాకు భారత్, బ్రెజిల్, చైనాలు చారిత్రక వ్యాపార భాగస్వాములని, 2024లో 3 బిలియన్ డాలర్లుగా ఉన్న భారత్-ఘనా ద్వైపాక్షిక □□□□□□ ం ప్రస్తుతం మరింత పెరిగిందని, దీనిని 7 బిలియన్ డాలర్లకు తీసుకెళ్లడమే లక్ష్యమని ఆయన వివరించారు.

చర్చల అనంతరం వ్యవసాయ పరిశోధన, శిక్షణ మరియు జీవవైవిధ్య రంగాలలో ఇరుదేశాలు పరస్పర ఒప్పందాలపై సంతకాలు చేశాయి. గ్లోబల్ సౌత్ దేశాలుగా ఆహార భద్రత, ఆరోగ్య సంరక్షణ, డిజిటలైజేషన్ మరియు మౌలిక సదుపాయాల కల్పన వంటి సమాన సవాళ్లను ఎదుర్కొంటున్న దృష్ట్యా తమ అనుభవాలను



పరస్పరం పంచుకోవడం ఎంతో శ్రేయస్కరమని జైశంకర్ అభిప్రాయపడ్డారు. పర్యటనలో భాగంగా ఘనా అధ్యక్షుడు జాన్ డ్రమాని మహామాతో భేటీ అయిన జైశంకర్, భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ తరపున శుభాకాంక్షలు అందజేశారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి సంస్కరణల కోసం గ్లోబల్ సౌత్ భాగస్వాములుగా భారత్, ఘనా కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రణాళిక ప్రకారం ఇందిరమ్మ ఇండ్లు పూర్తి చేయాలి..



- కలెక్టర్ గరిమ అగ్రవాల్

బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:

ప్రణాళిక ప్రకారం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేయించాలని, అధికారులు నిర్మాణాల పురోగతిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి, పనుల్లో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.

ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణాల పురోగతి, గుడిసెల్లో ఉన్న వారికి మంజూరు, రూఫ్ రీప్లేస్మెంట్ తదితర అంశాలపై మండల ప్రత్యేక అధికారులు, గృహనిర్మాణ శాఖ, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలతో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ బుధవారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.

జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలతో పాటు అన్ని మండలాల వారీగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతిని జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు మంజూరు చేసిన గృహాలు, వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్న వివరాలతో పాటు, పూర్తయిన ఇండ్ల వివరాలను గృహ నిర్మాణ శాఖ అధికారులు, ఎంపీడీఓ లు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్ళారు. 6,396 ఇండ్లకు ముగ్గు పోయగా, బేస్ మెంట్ లెవెల్ లో 5,346, గోడల లెవెల్ లో 4,793, స్లాబ్ లెవెల్ లో 4,511 ఉండగా, 3,862 ఇండ్లు పూర్తి అయ్యాయని అధికారులు తెలిపారు.

ఇండ్లు లేని పేదల కలలను సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకం పారదర్శకంగా అమలు చేస్తుందని తెలిపారు. గుడిసెలు, రేకుల షెడ్లలో నివసిస్తున్న వారికి పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని ఆదేశించారు. త్వరితగతిన నిర్మించుకునేలా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

దశల వారీగా ప్రగతిలో ఉన్న ఇండ్లను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి గృహప్రవేశాలు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓ లు, ఏఈ లు ప్రతిరోజూ క్షేత్ర స్థాయిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతిని పరిశీలించి, లబ్ధిదారులు ఇండ్లను వేగవంతంగా పూర్తి చేసేలా దిశానిర్దేశం చేయాలని ఆదేశించారు. రోజూ వారీగా ఇండ్లను లక్ష్యం మేరకు పూర్తి చేయాలని సూచించారు. ఎప్పటికప్పుడు ఫొటోలు తీసి ఆన్లైన్ లో అప్ లోడ్ చేయించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

టెలీ కాన్ఫరెన్స్ లో హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు తదితరులు పాల్గొన్నారు.



హర్మూజ్ జలసంధి నియంత్రణపై డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు!

బలగం టీవీ, వాషింగ్టన్

ఇరాన్‌తో కొనసాగుతున్న యుద్ధం మరియు వ్యూహాత్మకంగా ఎంతో కీలకమైన హర్మూజ్ జలసంధి (Strait of Hormuz) పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మేరీల్యాండ్‌లోని స్పారోస్ పాయింట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, ఇరాన్‌తో యుద్ధానికి త్వరలోనే ముగింపు పలుకుతామని స్పష్టం చేశారు. ఈ ముగింపు అనుకూలమైన/సౌమ్యమైన మార్గంలో ఉంటుందా (Nice way) లేక తీవ్రమైన కఠిన చర్యల ద్వారా ఉంటుందా (Not-so-nice way) అనేది అతిత్వరలోనే తేలుతుందని హెచ్చరించారు.

హర్మూజ్ జలమార్గంపై తమ నౌకాదళానిదే పూర్తి ఆధిపత్యమని, ప్రస్తుతం అది అమెరికా నియంత్రణలోనే ఉందని ట్రంప్ తెలిపారు. ఇరాన్ వైపు ఎలాంటి నౌకలు వెళ్లకుండా దిగ్బంధం విధించామని, ఇలాంటి కట్టుదిట్టమైన చర్యలను ప్రపంచం గతంలో ఎన్నడూ చూడలేదని పేర్కొన్నారు. ఇరాన్‌కు సంబంధం లేని ప్రాంతాల నుండి చమురు రవాణా తిరిగి పుంజుకుందని స్పష్టం చేశారు.

అంతేకాకుండా ఇరాన్ సైనిక సామర్థ్యం పూర్తిగా దెబ్బతిన్నదని, పశ్చిమాసియాలో ఒకప్పుడు శక్తివంతంగా ఉన్న ఇరాన్ ఇప్పుడు తన ప్రాభావాన్ని కోల్పోయిందని ట్రంప్ అన్నారు. ఇరాన్ ఎట్టి పరిస్థితుల్లోనూ అణ్వాయుధాన్ని సాధించకుండా అమెరికా నౌకాదళం అడ్డుకుంటుందని, ఈ విషయంలో ఎలాంటి రాజీ ఉండదని తేల్చిచెప్పారు.

అమెరికా నౌకాదళానికి భారీ షిప్‌యార్డ్ ప్రాజెక్ట్:

ఇదే వేదికపై అమెరికా నౌకాదళ సామర్థ్యాన్ని మరింత పెంచేలా మేరీల్యాండ్‌లోని స్పారోస్ పాయింట్‌లో "ఆర్సెనల్-2" (Arsenal-2) పేరుతో భారీ షిప్‌యార్డ్ నిర్మాణాన్ని ప్రకటించారు.

అంతర్జాతీయ విద్యార్థుల ఉద్యోగాలపై ట్రంప్ సర్కార్ నిబంధనలు

రూ. 58 లక్షల రుసుము ప్రతిపాదన!

బలగం టీవీ, వాషింగ్టన్

అమెరికాలో చదువు పూర్తయిన తర్వాత ఉద్యోగం చేయడానికి దరఖాస్తు చేసుకునే అంతర్జాతీయ విద్యార్థులపై డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం మరోసారి కఠిన నిబంధనలను తీసుకురావడానికి సిద్ధమైంది. ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (OPT) ప్రోగ్రామ్ కింద పని చేయాలనుకునే విదేశీ విద్యార్థుల కోసం విశ్వవిద్యాలయాలు గరిష్టంగా 70,000 అమెరికన్ డాలర్లు (సుమారు ₹58.8 లక్షలు) రుసుము చెల్లించాలని యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ (DHS) ప్రతిపాదించింది.

విదేశీ విద్యార్థుల ప్రవేశాన్ని అడ్డుకునే దిశగా ట్రంప్ పరిపాలనా యంత్రాంగం చేపడుతున్న చర్యల్లో భాగంగా ఈ కొత్త ప్రతిపాదన తెరపైకి వచ్చింది. కొత్త నిబంధనల ప్రకారం, విద్యార్థి తొలిసారి ఓపీటీ ప్రోగ్రామ్‌కు దరఖాస్తు చేసినప్పుడు విశ్వవిద్యాలయం లేదా కళాశాల $70,000 చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ ఆ విద్యార్థి పునరుద్ధరణ (రెన్యూవల్) కోసం దరఖాస్తు చేస్తే మరో $30,000 (సుమారు ₹25.2 లక్షలు) దాఖలు చేయాల్సి వస్తుంది.

సాధారణంగా అంతర్జాతీయ విద్యార్థులు డిగ్రీ పూర్తయిన తర్వాత ఏడాది పాటు అమెరికాలో పనిచేసేందుకు ఓపీటీ అనుమతి ఇస్తుంది. అలాగే సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథ్స్ (STEM) కోర్సులు చేసిన విద్యార్థులకు అదనంగా మరో రెండు సంవత్సరాల పాటు పనిచేసే అవకాశం ఉంటుంది. అయితే, విసా ప్రోగ్రామ్‌లలో జరుగుతున్న మోసాలను, చౌక విదేశీ కార్మికుల వినియోగాన్ని అరికట్టేందుకే ఈ రుసుమును ప్రతిపాదించినట్లు హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ శాఖ వెల్లడించింది.

ఈ ప్రతిపాదన అమలులోకి వస్తే విదేశీ విద్యార్థుల ఫీజులపై ఎక్కువగా ఆధారపడే అమెరికన్ విశ్వవిద్యాలయాలతో పాటు సాంకేతిక రంగంలో నిపుణులైన విద్యార్థులను నియమించుకునే టెక్ కంపెనీలపై తీవ్ర ప్రభావం పడనుంది. విదేశీ విద్యార్థుల నైపుణ్యాలను దూరంచేస్తే అమెరికా ఆవిష్కరణలు, ఆర్థిక వృద్ధి మరియు ఉపాధి అవకాశాలు దెబ్బతింటాయని విదేశీ విద్యా సంస్థల ప్రతినిధి సంస్థ 'నాఫ్సా' (NAFSA) ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ప్రతిపాదనపై ప్రజల అభిప్రాయాల సేకరణకు 60 రోజుల సమయం ఇవ్వగా, ఆ తర్వాత దీనిపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. కాగా, ఈ నిర్ణయాన్ని విద్యా సంస్థలు, వ్యాపార వర్గాలు న్యాయస్థానాల్లో సవాలు చేసే అవకాశం ఉంది.



శ్రీలంక మాజీ ప్రథమ మహిళ శిరాంతి రాజపక్షే అరెస్ట్

అవినీతి కేసుల్లో చర్యలు తీవ్రం!

బలగం టీవీ, కొలంబో

శ్రీలంక రాజకీయాల్లో సంచలనం సృష్టిస్తూ, మాజీ ప్రథమ మహిళ శిరాంతి రాజపక్షేతో పాటు మరో ఇద్దరు ఉన్నతాధికారులను దేశ అవినీతి నిరోధక సంస్థ (CIABOC) అరెస్ట్ చేసింది. శ్రీలంక చరిత్రలోనే ఒక మాజీ ప్రథమ మహిళ అవినీతి కేసులో అరెస్టవ్వడం ఇదే తొలిసారి.

ప్రధాన అరెస్టులు & వివరాలు:

శిరాంతి రాజపక్షే (మాజీ ప్రథమ మహిళ):

కేసు: ఆమె నేతృత్వంలోని 'సిరిలియ సవియ' ఎన్జీవో ద్వారా కొలంబోలోని 'లేడీ రిడ్జ్‌వే చిల్డ్రన్ హాస్పిటల్'కు సీటీ స్కేనర్ యంత్రాన్ని కొనుగోలు చేయడానికి సేకరించిన 10 మిలియన్ శ్రీలంక రూపాయల (సుమారు $30,251 డాలర్లు) ప్రజానిధులను దుర్వినియోగం చేశారనే ఆరోపణలు ఉన్నాయి.

చర్య: కిరులపొనెలోని ఆమె నివాసంలో విచారించిన అనంతరం అధికారులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. కొలంబో చీఫ్ మేజిస్ట్రేట్ కోర్టు ఆమెకు అక్టోబర్ 13 వరకు రిమాండ్ విధించింది.

రోహిత బొగొల్లాగామ (మాజీ విదేశాంగ మంత్రి):

కేసు: 2006లో పెట్టుబడుల ప్రోత్సాహక మంత్రిగా ఉన్న సమయంలో లండన్ ఈవెంట్ కోసం ట్రెజరీ అనుమతించిన నిధుల కంటే అదనంగా ఎల్‌కేఆర్ 1.5 మిలియన్ల బోర్డ్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్ (BOI) నిధులను ఆమోదించారనే ఆరోపణపై అరెస్ట్ చేశారు. గతంలో జారీ చేసిన ఓపెన్ వారెంట్ ఆధారంగా విచారణకు హాజరైనప్పుడు ఆయనను అదుపులోకి తీసుకున్నారు.

ప్రదీప్ కరియవసమ్ (నేషనల్ సేవింగ్స్ బ్యాంక్ మాజీ ఛైర్మన్):

కేసు: శిరాంతి రాజపక్షే ఎన్జీవో నిధుల బదిలీకి అక్రమంగా అనుమతులు ఇచ్చారనే ఆరోపణపై ఈయన్ను అరెస్ట్ చేసి, అనంతరం బెయిల్‌పై విడుదల చేశారు. (ఈయన శ్రీలంక మాజీ ప్రధాన న్యాయమూర్తి శిరాణి బండారనాయకే భర్త).

రాజపక్షే కుటుంబంపై ఇప్పటికే అనేక అవినీతి విచారణలు జరుగుతుండగా, మాజీ అధ్యక్షుడు మహింద రాజపక్షే కుమారుడు నామల్ రాజపక్షే కూడా ప్రస్తుతం వేరే కేసులో రిమాండ్‌లో ఉన్నారు. అయితే ఈ ఆరోపణలన్నింటినీ రాజపక్షే కుటుంబం రాజకీయ ప్రేరేపితమైనవిగా కొట్టిపారేసింది.

పోలాండ్‌లో పాఠశాలలో కత్తితో దాడి

8 మందికి గాయాలు.. 19 ఏళ్ల విద్యార్థి అరెస్ట్

బలగం టీవీ, ఒస్ట్రోలెంకా (పోలాండ్)

ఉత్తర పోలాండ్‌లోని ఓ వృత్తి విద్యా పాఠశాలలో 19 ఏళ్ల విద్యార్థి పదునైన వస్తువుతో తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు, బాటసారులపై దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో ఎనిమిది మంది గాయపడగా.. పరారైన నిందితుడిని పోలీసులు సమీపంలోనే అదుపులోకి తీసుకున్నారు.ఒస్ట్రోలెంకాలోని వొకేషనల్ స్కూల్ కాంప్లెక్స్ నంబర్-4లో బుధవారం ఉదయం 11 గంటల సమయంలో ఈ దాడి జరిగినట్లు పోలీసులు తెలిపారు. గాయపడిన వారిలో నలుగురు విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులు, ఇద్దరు బాటసారులు ఉన్నట్లు ప్రాసిక్యూటర్ల ప్రతినిధి ఎల్జ్‌బియేటా ఎడిటా లుకాసివిచ్ వెల్లడించారు. గాయాలు ఎవరికీ ప్రాణాపాయం కలిగించే స్థాయిలో లేవని, అయితే ఒకరి పరిస్థితి తీవ్రంగా ఉందని తెలిపారు. కొందరిని హెలికాప్టర్ ద్వారా ఆసుపత్రికి తరలించారు.నిందితుడిని పోలాండ్ గోప్యతా చట్టాల ప్రకారం జాకుబ్ జెడ్‌గా మాత్రమే అధికారులు గుర్తించారు. దాడి అనంతరం పాఠశాల నుంచి పారిపోయిన అతడిని కిలోమీటరు దూరంలో నదీ తీరంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు సమయంలో అతడికి గాయాలుండగా.. స్వయంగా గాయపర్చుకున్నట్లు ప్రాసిక్యూటర్లు తెలిపారు. అనంతరం అతడిని ఆసుపత్రికి తరలించారు. దాడికి గల కారణం, ఉపయోగించిన ఆయుధానికి సంబంధించిన వివరాలను అధికారులు వెల్లడించలేదు.ఘటన జరిగిన రెండు గంటల తర్వాత ఒస్ట్రోలెంకా మేయర్ పావెల్ నీవియాడోమ్స్కి పరిస్థితి అదుపులోకి వచ్చినట్లు తెలిపారు. అయితే దర్యాప్తు కొనసాగుతున్నందున పాఠశాలను మూసివేస్తున్నట్లు వెల్లడించారు. ఘటనతో ప్రభావితమైన విద్యార్థులు, ఇతరులకు మానసిక సహాయం అందిస్తామని చెప్పారు. పాఠశాలల్లోకి అనుమానిత వ్యక్తులు ప్రవేశించకుండా చర్యలు తీసుకోవాలని ప్రాంతంలోని అన్ని విద్యాసంస్థలను కోరినట్లు తెలిపారు.



కేరీర్ బెస్ట్ ర్యాంక్‌కు దూసుకెళ్లిన శ్రేయాస్ అయ్యర్!

ఏడో స్థానానికి ఎగబాకిన స్టార్ బ్యాటర్

టాప్-10లో ఏకంగా నలుగురు భారత బ్యాటర్లు

వన్డే ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలోనే శుభ్‌మన్ గిల్

బలగం టీవీ, హైదరాబాద్

వెస్టిండీస్‌తో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో విధ్వంసకర సెంచరీతో విరుచుకుపడిన భారత స్టార్ బ్యాటర్ శ్రేయాస్ అయ్యర్ ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో దుమ్మురేపాడు. కేవలం 43 బంతుల్లోనే 102 రన్స్ చేసి నాకౌట్ ఇన్నింగ్స్ ఆడిన అయ్యర్, సరికొత్త ఐసీసీ ర్యాంకింగ్స్‌లో ఏకంగా 18 స్థానాలను ఎగబాకాడు. దీంతో తన అంతర్జాతీయ కెరీర్‌లోనే అత్యుత్తమంగా ఏడో ర్యాంకును చేరుకొని సత్తా చాటాడు.

టాప్-10లో నలుగురు మనోళ్లే

తాజా టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత ఆటగాళ్ల హవా స్పష్టంగా కనిపిస్తోంది. ఐసీసీ ప్రకటించిన టాప్-10 జాబితాలో ఏకంగా నలుగురు భారత బ్యాటర్లు చోటు దక్కించుకోవడం విశేషం. భారత డాషింగ్ ఓపెనర్లు ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మలు అగ్రస్థానాల్లో కొనసాగుతుండగా, శ్రేయాస్ అయ్యర్ ప్రస్తుతం టీ20 ఫార్మాట్‌లో అత్యుత్తమ ర్యాంక్ సాధించిన మూడో భారత బ్యాటర్‌గా ఘనత సాధించాడు. మరో వైపు యంగ్ గన్ తిలక్ వర్మ 10వ స్థానంలో నిలిచి తన ఉనికిని చాటుకున్నాడు.

పుంజుకున్న యంగ్ సెన్సేషన్ వైభవ్

ఇటీవల కాలంలో వార్తల్లో నిలుస్తున్న టీమిండియా యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ కూడా ఐసీసీ ర్యాంకింగ్స్‌లో పురోగతి సాధించాడు. తాజా జాబితాలో వైభవ్ 8 స్థానాలు మెరుగుపరుచుకుని 46వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. మరోవైపు వన్డే ఫార్మాట్ బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తన అగ్రస్థానాన్ని (నెంబర్ 1) విజయవంతంగా నిలబెట్టుకుని జోరు కొనసాగిస్తున్నాడు.



హైదరాబాద్‌లో హోరాహోరీగా 'కృష్ణ ఇన్విటేషనల్'

తొలి రోజే అదరగొట్టిన గోల్ఫర్లు!

బలగం టీవీ, హైదరాబాద్

Hyderabad Golf Association (హెచ్‌జీఏ) కోర్సు వేదికగా బుధవారం ప్రారంభమైన 'ఏఎమ్ గ్రీన్ ఐజీపీఎల్ కృష్ణ ఇన్విటేషనల్ హైదరాబాద్' (పంజాబ్ రాప్టర్స్ సమర్పణ) తొలి రోజే అద్భుతమైన స్కోర్లతో ఆకట్టుకుంది. దిగ్గజ గోల్ఫర్ గగన్‌జీత్ భుల్లార్ సహా ఐదుగురు ఆటగాళ్లు 5-అండర్ 65 స్కోరు సాధించి సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచారు.

ఫామ్‌లో ఉన్న ఆర్యన్ రూపా ఆనంద్, మాజీ ఇండియన్ ఓపెన్ ఛాంపియన్ సీ మునియప్ప, రోహిత్ బైసోయా, ఈ టోర్నీ ద్వారా ఐజీపీఎల్‌లోకి అరంగేట్రం చేసిన యుఏఈ ఆటగాడు జోషువా గ్రెన్‌విల్-వుడ్ అంతా 5-అండర్ స్కోరుతో టాప్ లీడర్‌బోర్డ్‌ను పంచుకున్నారు. మొదటి 16 మంది గోల్ఫర్లు కేవలం రెండు షాట్ల వ్యవధిలోనే కొనసాగుతుండటంతో రాబోయే రెండు రోజుల ఆట అత్యంత ఉత్కంఠభరితంగా మారనుంది.

టీమ్ కేటగిరీలో తీవ్ర పోటీ: జట్ల విభాగంలో 'పంజాబ్ రాప్టర్స్', 'విమ్రా చెన్నై లైన్స్ జీసీ' చెరో 9-అండర్ స్కోరుతో సంయుక్తంగా అగ్రస్థానాన్ని దక్కించుకున్నాయి. చెన్నై జట్టులో భుల్లార్ (5-అండర్), సమర్థ్ ద్వివేది, యశస్ చంద్ర (చెరో 4-అండర్), హర్ష్‌జీత్ సేథి (3-అండర్) అద్భుత ప్రదర్శన చేశారు. మరోవైపు పంజాబ్ రాప్టర్స్ తరఫున మునియప్ప (5-అండర్), హరేంద్ర గుప్తా (4-అండర్), కరణ్‌దీప్ కొచ్చర్ (3-అండర్) రాణించారు.

ఆర్‌వీఆర్ ఢిల్లీ బ్లూ బుల్స్ జట్టులో ఆర్యన్ రూపా ఆనంద్ (5-అండర్) అగ్రస్థానంలో నిలవగా, అతనికి కెప్టెన్ శివ్ కపూర్ (1-అండర్) మద్దతుగా నిలిచారు.

ఒక్క షాట్ దూరంలో నలుగురు: లీడర్లకు ఒక్క షాట్ దూరంలో సమర్థ్ ద్వివేది, హరేంద్ర గుప్తా, యశస్ చంద్ర మరియు ఈ సీజన్‌లో అరంగేట్రం చేసిన రవికుమార్ 4-అండర్ 66 స్కోరుతో రెండో స్థానంలో ఉన్నారు. సమర్థ్ ద్వివేది 16 హోల్స్ పూర్తయ్యేసరికి 5-అండర్‌తో టాప్‌లో ఉన్నప్పటికీ, 17వ హోల్ వద్ద ఒక షాట్ కోల్పోవడంతో 4-అండర్‌తో ముగించాడు.

మరోవైపు, ఈజిప్ట్‌లో జరిగిన ఆసియన్ డెవలప్‌మెంట్ టూర్ ఈవెంట్‌లో మూడో స్థానంలో నిలిచిన పుఖ్‌రాజ్ సింగ్ గిల్ తొలి 5 హోల్స్‌లో రెండు షాట్లు కోల్పోయినా.. ఆ తర్వాత పుంజుకుని 5 బార్డీలతో 3-అండర్ 67 నమోదు చేసి పదో స్థానంలో నిలిచాడు. ప్రముఖ మహిళా గోల్ఫర్ వాణి కపూర్, హర్ష్‌జీత్ సేథి, డానిష్ వర్మ, సార్థక్ ఛిబ్బర్, సచిన్ బైసోయా, కరణ్‌దీప్ కొచ్చర్‌లతో కలిసి పుఖ్‌రాజ్ 10వ స్థానాన్ని పంచుకున్నాడు.



హర్మన్‌ప్రీత్ దశాబ్ద కాల నాయకత్వం అద్భుతం

కొనియాడిన నూతన సారథి స్మృతి మంధాన!

బలగం టీవీ, ముంబై

భారత మహిళల క్రికెట్ జట్టు నూతన సారథిగా బాధ్యతలు చేపట్టిన స్మృతి మంధాన, తన పూర్వగామి హర్మన్‌ప్రీత్ కౌర్ దశాబ్ద కాల నాయకత్వ ప్రస్థానాన్ని "అద్భుతం" అని కొనియాడారు. ఇన్ని సంవత్సరాలు కలిసి ఆడటం గొప్ప అనుభూతినిచ్చిందని, భవిష్యత్తులో కూడా ఇద్దరం కలిసి జట్టుకు మరిన్ని చిరస్మరణీయ విజయాలు అందించడానికి శ్రమిస్తామని ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఆశాభావం వ్యక్తం చేశారు. అన్ని ఫార్మాట్ల కెప్టెన్సీ బాధ్యతల నుంచి హర్మన్‌ప్రీత్ వైదొలగడంతో ఆమె 10 ఏళ్ల విజయవంతమైన సారథ్య ప్రస్థానం ముగిసింది. ఈ కాలంలో ఆమె నాయకత్వంలో భారత్ తొలిసారిగా 2025 నవంబర్‌లో వన్డే ప్రపంచకప్ టైటిల్‌ను గెలవడంతో పాటు 2023, 2026 ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకాలను సాధించింది. ఈ నెల చివర్లో జింబాబ్వేతో జరగనున్న వన్డే, టి20 సిరీస్‌లతో స్మృతి మంధాన పూర్తిస్థాయి కెప్టెన్‌గా తన ప్రయాణాన్ని ప్రారంభించనున్నారు.

ఈ సందర్భంగా పలువురు భారత సహచర క్రీడాకారిణులు హర్మన్‌ప్రీత్ సేవలకు కృతజ్ఞతలు తెలిపారు. గాయం కారణంగా దూరమైన జెమిమా రోడ్రిగ్స్ ఆమె సాధించిన విజయాలకు అభినందనలు తెలుపుతూ ఇన్ని ఏళ్ల నాయకత్వానికి ధన్యవాదాలు చెప్పారు. వికెట్ కీపర్ బ్యాటర్ రిచా ఘోష్ సోషల్ మీడియాలో స్పందిస్తూ, కెప్టెన్సీ అనే అధ్యాయం ముగిసినప్పటికీ ఒక నాయకురాలిగా ఆమె చూపిన ప్రభావం ఎప్పటికీ చెరిగిపోదని, ఇది ముగింపు కాదని ఒక కొత్త అధ్యాయానికి ఆరంభం మాత్రమేనని పేర్కొన్నారు. బౌలర్లు శ్రీ చరణి, రేణుకా సింగ్ ఠాకూర్ కూడా తమ కెరీర్ ఎదుగుదలలో హర్మన్‌ప్రీత్ ఇచ్చిన ప్రోత్సాహాన్ని, మార్గదర్శకత్వాన్ని గుర్తుచేసుకున్నారు.

మాజీ భారత ఆల్‌రౌండర్ సురేష్ రైనా కూడా హర్మన్‌ప్రీత్ నాయకత్వాన్ని ప్రశంసిస్తూ, ధైర్యం మరియు దృఢత్వంతో కూడిన ఆమె ప్రయాణం ఎందరికో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. కాగా కెప్టెన్సీ నుంచి తప్పుకున్నప్పటికీ హర్మన్‌ప్రీత్ కౌర్ ఆటగాడిగా జట్టులోనే కొనసాగనున్నారు. జింబాబ్వేతో జరగనున్న రాబోయే వన్డే, టి20 సిరీస్‌ల కోసం ప్రకటించిన భారత జట్లలో ఆమె చోటు దక్కించుకున్నారు.

అగార్కర్ సేవలు అమోఘం

బీసీసీఐ ప్రశంసల జల్లు

సీనియర్ సెలక్షన్ కమిటీ ఛైర్మన్‌గా అగార్కర్ పదవీకాలం ముగింపు

ఆయన మార్గదర్శకత్వంలో భారత్‌కు మూడు ఐసీసీ ట్రోఫీలు, ఆసియా కప్‌లు

'టీమ్ ఫస్ట్' సిద్ధాంతానికి నిదర్శనమన్న గౌతమ్ గంభీర్

బలగం టీవీ, హైదరాబాద్

భారత పురుషుల క్రికెట్ జట్టు సీనియర్ సెలక్షన్ కమిటీ ఛైర్మన్‌గా మూడేళ్ల పాటు విశేష సేవలందించిన అజిత్ అగార్కర్‌పై భారత క్రికెట్ నియంత్రణ మౌలిక మండలి (బీసీసీఐ) ప్రశంసల వర్షం కురిపించింది. ఆయన పదవీకాలం ఇటీవల ముగియడంతో, ఖాళీగా ఉన్న ఈ పదవికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు బీసీసీఐ మంగళవారం అధికారికంగా వెల్లడించింది. ఆయన పదవీకాలాన్ని మరింత పొడిగిస్తారనే ప్రచారం నడుస్తున్న నేపథ్యంలో ఈ ప్రకటన వెలువడింది.

భారత క్రికెట్‌లో చిరస్మరణీయ అధ్యాయం

అగార్కర్ నాయకత్వంలో భారత క్రికెట్ జట్టు ఎన్నో చారిత్రాత్మక విజయాలను సొంతం చేసుకుంది. బీసీసీఐ తన అధికారిక 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతా ద్వారా స్పందిస్తూ, అగార్కర్ హయాం భారత క్రికెట్ చరిత్రలో ఎంతో ప్రత్యేకమైనదని కొనియాడింది. ఈ మూడేళ్ల కాలంలో టీమిండియా మూడు ఐసీసీ ట్రోఫీలు, రెండు ఆసియా కప్ టైటిళ్లు మరియు ఆసియా గేమ్స్‌లో వరసగా రెండు స్వర్ణ పతకాలను సాధించింది. అంతేకాకుండా 2023 వన్డే ప్రపంచకప్ ఫైనల్ వరకు నిలిచి అద్భుత ప్రదర్శన కనబరిచిందని బీసీసీఐ గుర్తుచేసుకుంది.



నిబద్ధత మరియు దూరదృష్టితో పయనం

సెలక్షన్ కమిటీ ఛైర్మన్‌గా అగార్కర్ చూపిన నిబద్ధత, ఖచ్చితత్వం మరియు అందించిన సహకారం ఎనలేనివని బీసీసీఐ కొనియాడింది. ఆయన భవిష్యత్ ప్రయాణానికి శుభాకాంక్షలు తెలుపుతూ ధన్యవాదాలు తెలియజేసింది. అగార్కర్ పదవీకాలంలోనే భారత్ 2024, 2026 టి20 ప్రపంచకప్‌లతో పాటు 2025 ఛాంపియన్స్ ట్రోఫీని కైవసం చేసుకుంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల వంటి దిగ్గజ ప్లేయర్లు టి20, టెస్టు క్రికెట్ నుంచి తప్పుకున్న క్లిష్ట సమయంలో జట్టులో కొత్త తరం ప్లేయర్లను విజయవంతంగా సన్నద్ధం చేయడంలో అగార్కర్ కీలక పాత్ర పోషించారు.

చరిత్ర అగార్కర్‌ను గుర్తుపెట్టుకుంటుంది: గౌతమ్ గంభీర్

బీసీసీఐ ప్రకటనకు ముందు భారత జట్టు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ కూడా అగార్కర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. 'టీమ్ ఫస్ట్' (వ్యక్తుల కంటే జట్టే ముఖ్యం) అనే సూత్రాన్ని నమ్మి ఆయన తీసుకున్న నిర్ణయాలే భారత్ మూడు ఐసీసీ ట్రోఫీలు గెలవడానికి పునాది వేశాయని గంభీర్ పేర్కొన్నారు. రాబోయే కాలంలో క్రికెట్ చరిత్ర అగార్కర్ అందించిన సేవలను ఎంతో గౌరవంగా గుర్తుంచుకుంటుందని వ్యాఖ్యానించారు.

ఫ్రెండ్లీ మ్యాచ్‌లో విజృంభించిన భారత్



మయన్మార్ పై 4-0 తో భారత U17 ఫుట్‌బాల్ జట్టు ఘన విజయం!

బలగం టీవీ, హైదరాబాద్

మయన్మార్ పర్యటనలో ఉన్న భారత U17 పురుషుల ఫుట్‌బాల్ జట్టు అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంది. బుధవారం ఇక్కడ జరిగిన రెండో ఫ్రెండ్లీ మ్యాచ్‌లో ఆతిథ్య మ్యాన్మార్ జట్టుపై 4-0 తేడాతో భారత్ ఘన విజయం సాధించింది. కెప్టెన్ దలాల్‌మూన్ గాంగ్టే (40వ నిమిషం), కమ్‌గౌహావ్ దూంగెల్ (60వ నిమిషం), హృషికేష్ చరణ్ మానవతి (72వ నిమిషం) ఒక్కో గోల్ చెయగా, ఆతిథ్య జట్టు ఆటగాడు క్యీ థార్ (53వ నిమిషం) చేసిన ఓన్ గోల్‌తో భారత్ తిరుగులేని ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.

భారత U17 హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన మెహరాజుద్దీన్ వాడూకి ఇది తొలి విజయం కావడం విశేషం. 'ఎఫ్‌సీ U17 ఆసియన్ కప్ 2027 Qualifier' పోటీల సన్నాహకాల్లో భాగంగా జరిగిన ఈ పర్యటనలో, మూడు రోజుల క్రితం ఇరు జట్ల మధ్య జరిగిన తొలి మ్యాచ్ 1-1 తో డ్రాగా ముగిసింది.

తొలి అర్ధభాగంలో లభించిన ఆధిక్యం: వింగ్‌బ్యాక్ లామ్‌సంగ్‌జువాలా, వింగర్ దూంగెల్, కెప్టెన్ గాంగ్టేలు ఆరంభం నుంచే అద్భుతంగా సమన్వయం చేసుకుంటూ మ్యాన్మార్ రక్షణ శ్రేణిపై ఒత్తిడి పెంచారు. 40వ నిమిషంలో లామ్‌సంగ్‌జువాలా అందించిన పాస్‌ను దూంగెల్ అందుకొని గాంగ్టేకి అందించగా, అతడు బంతిని ప్రత్యర్థి డిఫెండర్‌ను తప్పిస్తూ నెట్‌లోకి పంపి భారత్‌కు 1-0 ఆధిక్యాన్ని అందించాడు.

రెండో అర్ధభాగంలో గోల్స్ జోరు: రెండో అర్ధభాగం ప్రారంభమైన 20 నిమిషాల వ్యవధిలోనే భారత్ మూడు గోల్స్ నమోదు చేసింది.

53వ నిమిషంలో సబ్‌స్టిట్యూట్ ఆటగాడు మాల్డినో సింగ్ పంపిన క్రాస్‌ను అడ్డుకునే క్రమంలో మ్యాన్మార్ డిఫెండర్ క్యీ థార్ కాలికి తగిలి బంతి నెట్‌లోకి వెళ్లడంతో భారత్‌కు ఓన్ గోల్ రూపంలో రెండో పాయింట్ దక్కింది.

60వ నిమిషంలో మానవతి ఇచ్చిన బ్యాక్ పాస్‌ను నియంత్రించిన దూంగెల్, సుదూర మూలకు షాట్ కొట్టి గోల్ నమోదు చేయడంతో భారత్ 3-0 తో ముందంజ వేసింది.

72వ నిమిషంలో మానవతి స్వయంగా బాక్స్ వెలుపల నుండి కొట్టిన శక్తివంతమైన లెఫ్ట్ ఫుట్ షాట్ పోస్ట్‌ను తాకుతూ గోల్‌గా మారడంతో భారత విజయం సంపూర్ణమైంది (4-0).

ఈ విజయంతో మ్యాన్మార్ పర్యటనను ఘనంగా ముగించిన భారత జట్టు స్వదేశానికి తిరుగుపయనం కానుంది. వచ్చే నెలలో మలేషియా వేదికగా జరగనున్న AFC U17 ఆసియన్ కప్ క్వాలిఫైయర్స్ కోసం బ్లూ కోల్ట్స్ జట్టు శిక్షణ కొనసాగించనుంది.

నమన్ ధీర్ రాకతో వాషింగ్టన్ సుందర్ వైట్‌బాల్ కెరీర్ ముగిసినట్లే

క్రిష్ శ్రీకాంత్ వ్యాఖ్యలు!

బలగం టీవీ, హైదరాబాద్

టీమిండియా యువ ఆల్‌రౌండర్ నమన్ ధీర్ అద్భుత ప్రదర్శనతో సీనియర్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ వైట్‌బాల్ (పరిమిత ఓవర్ల) కెరీర్ ముగిసినట్లేనని భారత మాజీ దిగ్గజ క్రికెటర్ క్రిష్ శ్రీకాంత్ సంచలన వ్యాఖ్యలు చేశారు. లభించిన అవకాశాన్ని నమన్ ధీర్ రెండు చేతులా అందిపుచ్చుకున్నాడని ఆయన కొనియాడారు. తరుచూ గాయాల బారిన పడే వాషింగ్టన్ సుందర్ ఇకపై టెస్టు క్రికెట్‌కు మాత్రమే పరిమితమయ్యే అవకాశం ఉందని శ్రీకాంత్ తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా అభిప్రాయపడ్డారు.

వెస్టిండీస్‌తో జరిగిన సిరీస్‌లో చివరి నిమిషంలో టీ20 జట్టులోకి వచ్చిన నమన్ ధీర్ తొలి మ్యాచ్‌లోనే మూడు వికెట్లు తీసి భారత విజయంలో కీలక పాత్ర పోషించాడు. రాబోయే టెస్ట్ మ్యాచ్‌ల సన్నాహకాల కోసం వాషింగ్టన్ సుందర్‌ను టీ20ల నుంచి తప్పించి రంజీ క్రికెట్ ఆడాలని సెలెక్టర్లు ఆదేశించిన నేపథ్యంలో, ఆయన స్థానంలో వచ్చిన నమన్ ధీర్ తన బౌలింగ్ సత్తాతో అందరినీ ఆకట్టుకున్నాడు. ఆ తర్వాత న్యూజిలాండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లోనూ సుందర్‌కు అవకాశం దక్కకపోగా, సెలెక్టర్లు నమన్ ధీర్‌కే ఓటు వేశారు.

తరచూ గాయపడటం సుందర్‌కు అలవాటుగా మారిందని, ఇప్పుడు అతని స్థానంలోకి వచ్చిన నమన్ ధీర్ ఆరంభ మ్యాచ్‌ల్లోనే అద్భుత ప్రదర్శనతో సుందర్ పునరాగమన దారులను మూసేశాడని శ్రీకాంత్ విశ్లేషించారు. జట్టు నుంచి తప్పించలేని స్థాయికి నమన్ ధీర్ చేరుకున్నాడని, కాబట్టి పరిమిత ఓవర్ల క్రికెట్‌లో అతడిని పక్కన పెట్టడం కష్టమని పేర్కొన్నారు.

కాగా, వెస్టిండీస్‌తో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో టీమిండియా 8 వికెట్ల తేడాతో ఘనవిజయం



సాధించింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ 43 బంతుల్లో 10 ఫోర్లు, 6 సిక్సర్లతో 102 పరుగులు చేసి అజేయ శతకంతో రాణించగా, నమన్ ధీర్ 3 వికెట్లతో మెరిసాడు. ఈ గెలుపుతో ఐదు టీ20ల సిరీస్‌లో భారత జట్టు 1-0 ఆధిక్యంలో నిలిచింది.

హాకీ ఇండియా లీగ్ పునరుద్ధరణకు కేంద్రం కీలక నిర్ణయం

ఏడుగురు సభ్యుల కమిటీ ఏర్పాటు!

బలగం టీవీ, హైదరాబాద్

ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన హాకీ ఇండియా లీగ్ (హెచ్ఐఎల్) పునరుద్ధరణ దిశగా కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ కీలక అడుగు వేసింది. హాకీ ఇండియా ప్రతినిధులు, ఫ్రాంచైజీల ప్రతినిధులు మరియు క్రీడా శాఖ అధికారులతో కూడిన ఏడుగురు సభ్యుల కమిటీని అధికారికంగా ఏర్పాటు చేసింది. గత సెప్టెంబర్‌లో క్రీడా మంత్రి మన్సుఖ్ మాండవీయ, హాకీ ఇండియా అధికారులు మరియు ఫ్రాంచైజీ ప్రతినిధులతో సమావేశమై లీగ్ నిర్వహణపై నెలకొన్న ఆందోళనలను సమీక్షించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నారు.

ఈ ఏడుగురు సభ్యుల కమిటీలో క్రీడా మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ (ఖేలో ఇండియా) వినీల్ కృష్ణ, హాకీ ఇండియా అధ్యక్షుడు దిలీప్ తిర్కీ, ప్రధాన కార్యదర్శి భోలా నాథ్ సింగ్, ట్రెజరర్ శేఖర్ జె మనోహరన్ ఉన్నారు. ఫ్రాంచైజీల తరఫున అలోక్ సంఘీ, మహేష్ భూపతి, దివ్యాంశు సింగ్‌లకు చోటు లభించింది. లీగ్ గవర్నెన్స్ మోడల్, ఫైనాన్షియల్ మోడల్ మరియు పోటీల నిర్మాణాన్ని ప్రాధాన్యతా ప్రాతిపదికన సమీక్షించి, నిర్దిష్ట గడువులోగా నివేదిక సమర్పించాలని క్రీడా మంత్రిత్వ శాఖ ఈ కమిటీకి సూచించింది.ఆర్థిక ఇబ్బందుల వల్ల మహిళల హాకీ ఇండియా లీగ్ (WHIL) నిలిచిపోయే ప్రమాదం ఏర్పడటంతో, ఆగస్టులో జరిగిన వరల్డ్ కప్ సందర్భంగా కెప్టెన్ సలీమా టెటే, సవితా పునియాతో సహా పలువురు భారత మహిళా హాకీ క్రీడాకారిణులు లీగ్‌ను కాపాడాలని భావోద్వేగ విజ్ఞప్తి చేశారు. ఆ ప్రపంచకప్‌లో భారత జట్టు 1974 తర్వాత అత్యుత్తమంగా ఐదో స్థానంలో నిలిచింది. ఏడేళ్ల విరామం తర్వాత 2024లో హెచ్ఐఎల్ పునఃప్రారంభమైనప్పటికీ, పెరుగుతున్న ఖర్చులు మరియు ఫ్రాంచైజీల భాగస్వామ్యంపై స్పష్టత లేకపోవడంతో లీగ్ భవిష్యత్తుపై అనిశ్చితి నెలకొంది.



అంతేకాకుండా, హాకీ ఇండియా అధ్యక్షుడు దిలీప్ తిర్కీ, ప్రధాన కార్యదర్శి భోలా నాథ్ సింగ్‌ల మధ్య ఇటీవలి కాలంలో పరిపాలనాపరమైన విభేదాలు బయటపడటం, జెర్సీ వివాదం వంటి అంశాల నేపథ్యంతో ఈ కొత్త కమిటీ ఏర్పాటు ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రభుత్వం నేరుగా ప్రవేశించి ఏర్పాటు

కోల్‌కతా వేదికగా రష్యాతో భారత మహిళల ఫుట్‌బాల్ జట్టు పోరు

యువ ఆటగాళ్లకు సవాలు!

బలగం టీవీ, హైదరాబాద్



వచ్చే ఏడాది జరగనున్న 'ఏఎఫ్‌సీ మహిళల ఆసియన్ కప్' సన్నాహకాల్లో భాగంగా భారత మహిళల ఫుట్‌బాల్ జట్టు గురువారం ఇక్కడ జరగనున్న మొదటి అంతర్జాతీయ ఫ్రెండ్లీ మ్యాచ్‌లో బలమైన రష్యా జట్టుతో తలపడనుంది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 69వ స్థానంలో ఉన్న భారత 'బ్లూ టైగ్రెసెస్' జట్టు, 27వ ర్యాంక్‌లో ఉన్న రష్యాతో తలపడటం ఓ రకంగా కఠిన పరీక్షే అని చెప్పవచ్చు. గతంలో ఇరు జట్ల మధ్య జరిగిన రెండు పోరుల్లోనూ రష్యానే విజయం సాధించింది. 2021లో 8-0 తో, గతేడాది ఫిబ్రవరిలో షార్జా వేదికగా జరిగిన మ్యాచ్‌లో 2-0 తేడాతో రష్యా భారత్‌పై ఘనవిజయాలు నమోదు చేసింది.

కోల్‌కతాలోని కిషోర్ భారతి క్రీడాంగణం వేదికగా జరగనున్న ఈ మ్యాచ్‌కు మరొక ప్రత్యేకత ఉంది. సీనియర్ భారత మహిళల ఫుట్‌బాల్ జట్టు కోల్‌కతా నగరంలో అంతర్జాతీయ మ్యాచ్ ఆడటం ఇదే తొలిసారి. అంతేకాకుండా, జూన్‌లో ఆరోసారి సాఫ్ (SAFF) మహిళల ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను గెలుచుకున్న తర్వాత భారత్‌కు ఇదే మొదటి అంతర్జాతీయ మ్యాచ్ కావడం విశేషం.

భారత హెడ్ కోచ్ క్రిస్పిన్ ఛెత్రీ ఈ మ్యాచ్‌ను యువ క్రీడాకారుల ప్రతిభను పరీక్షించే మంచి అవకాశంగా భావిస్తున్నారు. ఆసియన్ కప్‌లో రాణించాలంటే ఇప్పటి నుంచే బలమైన జట్టును నిర్మించడం ప్రారంభించాలని ఆయన స్పష్టం చేశారు. సగటున 23 ఏళ్ల వయస్సు ఉన్న భారత జట్టులో, అండర్-20 స్థాయి నుంచి వచ్చిన పలువురు యువ ఆటగాళ్లకు సీనియర్ జట్టులో నిరూపించుకునే అవకాశం లభించింది. గోల్‌కీపర్ నందిని, వింగర్ సిబాని దేవి నోంగ్‌మేకాపమ్‌తో పాటు గాయం నుంచి కోలుకున్న ఫార్వర్డ్ ప్లేయర్ రేణు తిరిగి జట్టులోకి వచ్చారు. క్లబ్ మ్యాచ్‌ల కారణం (ఈస్ట్ బెంగాల్ క్లబ్ మ్యాచ్‌లు)గా కొందరు సీనియర్ ఆటగాళ్లు అందుబాటులో లేకపోవడం యువ ఆటగాళ్లకు తమ సత్తా చాటేందుకు ఒక అవకాశంగా మారనుంది.

మరోవైపు రష్యా జట్టు కూడా ఈ మ్యాచ్‌ను తేలికగా తీసుకోవడం లేదు. గత విజయాలు చరిత్ర మాత్రమేనని, ప్రతి కొత్త మ్యాచ్ ఇరు జట్లకు కొత్త సవాలు అని రష్యా కోచ్ యూరి క్రాస్నోజన్ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రమే కోల్‌కతా చేరుకున్న రష్యా జట్టుకు ప్రాక్టీస్ సమయం తక్కువగా లభించినప్పటికీ, ప్రస్తుతం డొమెస్టిక్ సీజన్ నడుస్తుండటంతో ఆటగాళ్లంతా పూర్తి ఫిట్‌నెస్‌తో ఉన్నారని డిఫెండర్ వెరోనికా

బలగం TV BALAGAM

balagamtv100@gmail.com

సక్సెస్ మాత్రం అందుకోలేకపోతున్నారు

పాయల్ రాజ్‌పుత్‌కు ఆఫర్లు తగ్గాయా? ఒకే ఒక్క సినిమాతో స్టార్‌గా మారి.. ఇప్పుడు మళ్లీ గట్టిగా ప్రయత్నిస్తున్న ఈ హీరోయిన్ తెలుగు సినీ ప్రేక్షకులకు పెద్దగా పరిచయం అవసరం లేని పేరు పాయల్ రాజ్‌పుత్. అందం, గ్లామర్‌తో పాటు నటనతోనూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఈ భామ.. కెరీర్ ప్రారంభంలోనే భారీ సక్సెస్‌ను అందుకుంది. అయితే ఆ తర్వాత అదే స్థాయిలో వరుస విజయాలను అందుకోలేకపోయింది. దీంతో ఒకప్పుడు వరుస అవకాశాలతో బిజీగా కనిపించిన పాయల్.. ఇప్పుడు ఆచితూచి సినిమాలు ఎంపిక చేసుకుంటోంది. పాయల్ రాజ్‌పుత్ కెరీర్‌ను 'ఆర్ 100'కు ముందు.. ఆ తర్వాత అని చెప్పుకోవచ్చు. 2018లో అజయ్ భూపతి దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా సంచలన విజయాన్ని అందుకోవడంతో పాయల్ ఒక్కసారిగా టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఇందులో ఆమె పోషించిన ఇందు పాత్ర ప్రేక్షకులపై బలమైన ముద్ర వేసింది. ముఖ్యంగా నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో పాయల్ చూపించిన నటనకు మంచి ప్రశంసలు దక్కాయి. పాయల్ కూడా పలుమార్లు 'ఆర్ 100' తన జీవితాన్ని మార్చేసిన సినిమా అని చెప్పుకొచ్చింది. 'ఆర్100' తర్వాత పాయల్‌పై అంచనాలు భారీగా పెరిగాయి. అయితే ఆ తర్వాత వచ్చిన సినిమాలు మాత్రం ఆమెకు ఆశించిన స్థాయిలో విజయాలను అందించలేకపోయాయి. 'సీత', 'ఆర్ డీ ఎక్స్ లవ్', 'వెంకీ మామా', 'డిస్కో రాజా', 'అనగనగా ఓ అతిథి', 'తీస్ మార్ ఖాన్',



'జిన్నా', 'మయా పేటిక', 'రక్షణ' వంటి చిత్రాల్లో నటించినప్పటికీ.. 'ఆర్ ఎక్స్ 100' స్థాయి ఇంపాక్ట్ మాత్రం మరోసారి రాలేదు. ఆర్ 100 తర్వాత పాయల్‌కు మరోసారి బలమైన గుర్తింపు తీసుకొచ్చిన సినిమా 'మంగళవారం'. అజయ్ భూపతి దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రంలో షైలుగా ఆమె చాలా విభిన్నమైన పాత్రను పోషించింది. ఈ పాత్ర కోసం మానసికంగా, భావోద్వేగంగా చాలా కష్టపడాల్సి వచ్చిందని పాయల్ స్వయంగా చెప్పింది. 'మంగళవారం' తన కెరీర్‌లో మరో ముఖ్యమైన చిత్రంగా నిలిచింది. ఈ సినిమా ద్వారా తాను కేవలం గ్లామర్ పాత్రలకు మాత్రమే పరిమితం కాదని పాయల్ నిరూపించుకునే ప్రయత్నం చేసింది. కానీ స్టార్ హీరోయిన్ స్థాయిలో వరుసగా భారీ కమర్షియల్ సినిమాలు, పెద్ద హీరోల సరసన అవకాశాలు రావడం మాత్రం తగ్గింది. దీనిపై గతంలో పాయల్ కూడా ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసింది. 'ఆర్100'లో నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్ర చేయడం వల్ల ప్రేక్షకులు, దర్శకులు తనను అదే తరహా పాత్రల్లో ఊహించి ఉండొచ్చని ఆమె అభిప్రాయపడింది. తాను అన్ని రకాల పాత్రలు చేయాలనుకుంటున్నానని, ఇంకా తనకు చాలా దూరం వెళ్లాల్సి ఉందని చెప్పింది. రీసెంట్ గా లీడర్ అనే సినిమా చేసింది. కానీ ఈ సినిమా కూడా ఫ్లాప్ అయ్యింది.

అక్టోబర్ 23న రాధిక 'డెలివరీ బాయ్' రిలీజ్

రాధిక శరత్ కుమార్, లియో శివకుమార్, బ్రిగిడా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తమిళ చిత్రం 'డెలివరీ బాయ్' విడుదల తేదీ ఖరారైంది. నాని దర్శకత్వం వహిస్తున్న ఈ ఎమోషనల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను ఈ ఏడాది అక్టోబర్ 23న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురానున్నట్లు చిత్ర బృందం బుధవారం అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు ప్రముఖ మ్యూజిక్ లేబుల్ 'సరిగమ తమిళ్' తమ సోషల్ మీడియా ఖాతాల ద్వారా విడుదల తేదీ పోస్టర్‌ను పంచుకుంది. ఈ సినిమా కథాంశం గురించి దర్శకుడు నాని గతంలో ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. "తల్లిని కాపాడుకోవడం కోసం ఓ డెలివరీ బాయ్ చేసే ప్రయత్నమే ఈసినిమా కథ. దిగువ మధ్యతరగతి కుటుంబానికిచెందినహీరో, తన తల్లిని రక్షించుకోవడానికి ఎలాంటి పోరాటం చేశాడనేది ఉత్కంఠభరితంగా ఉంటుంది. సినిమా ప్రారంభం నుంచి చివరి వరకు ప్రేక్షకులను కథలో లీనమయ్యేలా చేస్తుంది" అని ఆయన వివరించారు. గతేడాది డిసెంబర్‌లోనే ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసుకుంది. చెన్నై, కోయంబత్తూర్‌లలో కేవలం42రోజుల వ్యవధిలోనే మొత్తం చిత్రీకరణను ముగించడం విశేషం. షూటింగ్ పూర్తయిన వెంటనే డబ్బింగ్ సహా పోస్ట్-ప్రొడక్షన్ పనులను వేగంగా పూర్తి చేశారు. ఈ చిత్రంలో దుష్యంత్, కాళీ వెంకట్, బోస్ వెంకట్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. అశాసి క్రియేషన్స్ పతాకంపై అముత లియోనీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సుందరమూర్తి సంగీతం అందిస్తుండగా, ప్రసన్న కుమార్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. నంద మణివాసగం సంభాషణలు, వసంత్ ఎడిటింగ్ అందిస్తున్నారు.



నా వైఫ్ మిస్సింగ్ టీజర్ రిలీజ్



ఎప్పటికప్పుడు ఎగ్జైటింగ్ కంటెంట్ తో సబ్ స్క్రైబర్స్ ను ఎంగేజ్ చేస్తోన్న ఆహా ఓటీటీ ఇప్పుడు మరో ఎగ్జైటింగ్ సిరీస్ ను మన ముందుకు తీసుకొస్తోంది. వరుణ్ సందేశ్, శ్వేతా బసు ప్రధాన పాత్రల్లో ఆహా ఒరిజినల్ నా వైఫ్ మిస్సింగ్ ఈ నెల 22వ తేదీ నుంచి స్ట్రీమింగ్ కు రెడీ అవుతోంది. ఈ సిరీస్ తెలుగుతో పాటు తమిళంలోనూ సబ్ స్క్రైబర్స్ కు అందుబాటులో ఉండనుంది. నా వైఫ్ మిస్సింగ్ సిరీస్ ను లైట్ హౌస్ సినీ మ్యాజిక్ బ్యానర్ పై శివ కంఠంనేని నిర్మించారు. స్వాతిప్రకాష్ మంత్రిప్రగడ దర్శకత్వం వహించారు. ఈ రోజు నా వైఫ్ మిస్సింగ్ టీజర్ రిలీజ్ చేశారు. ఈ టీజర్ ఎలా ఉందో చూస్తే -- పెద్దలు కుదిర్చిన సంబంధంతో వైవాహిక జీవితంలోకి అడుగుపెడతారు వరుణ్, శ్వేతా. వారి దాంపత్య జీవితం సంతోషంగా సాగుతూ ఉంటుంది. కానీ టీజర్ లో పెళ్లిచూపుల సమయంలోనే తను వర్జిన్ కాదు అని హీరోయిన్ చెప్పడంతో హీరో షాక్ కు గురైనట్లు చూపించారు. ఆ తర్వాత పోలీస్ స్టేషన్ లో తన వైఫ్ మిస్ అయినట్లు వరుణ్ కంప్లైంట్ ఇవ్వడం క్యూరియాసిటీ క్రియేట్ చేస్తోంది. పెళ్లి చూపుల సమయంలో శ్వేత చెప్పింది నిజమేనా, ఆమె మిస్సింగ్ కు కారణాలు ఏంది, వరుణ్ పోలీసుల సహాయంతో తన భార్య ఎక్కడుందో తెలుసుకోగలిగాడా అనే ఇంట్రెస్టింగ్ ఎలిమెంట్స్ తో టీజర్ ఆకట్టుకుంటోంది. కొత్త బంగారు లోకం సినిమాతో యూత్‌లో మంచి క్రేజ్ సంపాదించుకున్న ఈ జంట.. ఇప్పుడు మరోసారి వెండితెరపై కలిసి కనిపించేందుకు సిద్ధమవుతోంది. కొత్త బంగారు లోకంలో వీరిద్దరి కెమిస్ట్రీ అప్పట్లో ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. ముఖ్యంగా యువతకు ఈ జోడీ బాగా కనెక్ట్ కావడంతో, వరుణ్ సందేశ్, శ్వేతా బసు ప్రసాద్‌లకు ప్రత్యేక గుర్తింపు వచ్చింది. చాలా కాలం తర్వాత ఈ ఇద్దరూ మరోసారి ఒకే సినిమాలో కనిపించనుండటంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

'ఫౌజీ' కంటే ముందు స్పిరిట్..

ఇండియాస్ బిగ్గెస్ట్ సూపర్ స్టార్, రెబల్ స్టార్ ప్రభాస్ చేతిలో నాలుగు సినిమాలు ఉన్నాయి. వాటిలో 'ఫౌజీ', 'స్పిరిట్' సినిమాల చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. అయితే... ఆ సినిమాల విడుదల విషయంలో కాస్త కన్‌ఫ్యూజన్ నెలకొంది. దానికి ప్రభాస్ తెర దించినట్టు తెలిసింది. థియేటర్లలోకి 'ఫౌజీ' కంటే ముందు 'స్పిరిట్'ను తీసుకు రావాలని ప్లాన్ చేశారట. హను రాఘవపూడి దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా నటిస్తున్న సినిమా 'ఫౌజీ'. తొలుత ఈ ఏడాది (2026) డిసెంబర్ మొదటి వారంలో విడుదల చేయాలని ప్లాన్ చేశారు. కానీ, ఆ తేదీకి సినిమా రావడం కష్టమని చిత్ర నిర్మాతలలో ఒకరైన 'మైత్రీ మూవీ మేకర్స్' రవిశంకర్ యలమంచిలి తెలిపారు. దాంతో ప్రభాస్ హీరోగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'స్పిరిట్' విడుదల సైతం వాయిదా పడే అవకాశాలు ఉన్నాయని ఫిల్మ్ నగర్ సర్కిళ్ళలో వినిపించింది. ఎందుకంటే... ఆ సినిమాను వచ్చే ఏడాది (2027) మార్చి 5న విడుదల చేయడానికి ప్లాన్ చేశారు. డిసెంబర్ నెలలో రావాల్సిన 'ఫౌజీ' రెండు మూడు నెలలు వెనక్కి వెళితే... మార్చి 2027లో విడుదలకు సిద్ధమవుతున్న 'స్పిరిట్' కూడా వెనక్కి వెళుతుందని ట్రేడ్ వర్గాలు భావించాయి. అయితే... 'ఫౌజీ' లేటైనా సరే 'స్పిరిట్' లేట్ కాకూడదని, హను రాఘవపూడి సినిమా కంటే ముందు సందీప్ రెడ్డి వంగా సినిమాను రిలీజ్ చేయాలని ప్రభాస్ డిసైడ్ అయ్యారట. అదీ సంగతి. తన కెరీర్‌లో 24వ సినిమా అనుకున్న 'ఫౌజీ'ని వెనక్కి తీసుకు వెళ్లి... 25వ సినిమా అనుకున్న 'స్పిరిట్'ను ప్రభాస్ ముందుకు తీసుకు వస్తున్నారన్నమాట. దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న 'స్పిరిట్'ను ముందుగా అనుకున్న ప్లాన్ ప్రకారమే షూట్ చేస్తున్నారు. కానీ, హను రాఘవపూడి దర్శకత్వంలోని 'ఫౌజీ' చిత్రీకరణ ఇంకా పూర్తి కాలేదు. అది సాగుతూ వెళుతోంది. అందువల్ల, వచ్చే ఏడాది వేసవి తర్వాత థియేటర్లలోకి తీసుకు రావడానికి సన్నాహాలు చేస్తున్నారట.



50 కోట్ల క్లబ్బులో 'మందాడి'



తమిళంలో హాస్య నటుడిగా కెరీర్ ప్రారంభించి, తర్వాత కథానాయకుడిగా మారిన నటుడు సూరి. తెలుగులో యూట్యూబ్ ఫిలిమ్స్ నుంచి కెరీర్ స్టార్ట్ చేసి, తర్వాత సినిమాల్లో హీరోగా స్నేహితుడి పాత్రలు చేసి, ఆ తర్వాత హీరోగా మారిన నటుడు సుహాస్. వీళ్ళిద్దరూ కలిసి నటించిన సినిమా 'మందాడి'. మందాడి'లో సూరి హీరోగా, సుహాస్ విలన్‌గా నటించారు. ఈ చిత్రాన్ని ఎలైడ్ కుమార్ సమర్పణలో ఆర్ఎస్ ఇన్ఫోటైన్‌మెంట్ పతాకంపై ఎలైడ్ కుమార్ నిర్మించారు. మతిమారన్ పుగళేంది దర్శకుడు. సూరి సరసన మహిమా నంబియార్ కథానాయికగా నటించగా... సత్యరాజ్, రవీంద్ర విజయ్, మిథున్, బాల శరవణన్ ఇతర కీలక పాత్రలు పోషించారు. కలెక్షన్స్ పరంగా ఈ సినిమా సరికొత్త రికార్డులు క్రియేట్ చేసింది. బాక్స్ ఆఫీస్ బరిలో 'మందాడి' సినిమా 150 కోట్ల రూపాయలు కలెక్ట్ చేసింది. ఏపీ, తెలంగాణలో ఈ చిత్రాన్ని మైత్రి మూవీ డిస్ట్రిబ్యూటర్స్ సెప్టెంబర్ 10న విడుదల చేసింది. తెలుగులో మంచి స్పందన అందుకుంది. తమిళనాడు బాక్స్ ఆఫీస్ లెక్కలు చూస్తే... కొత్త రికార్డులను క్రియేట్ చేసింది. తమిళ, తెలుగు రాష్ట్రాలతో పాటు విడుదల చేసిన అన్ని ఏరియాలలో 'మండాడి'కి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇప్పటి వరకు తమిళనాడులో వంద కోట్లకు పైగా గ్రాస్ కలెక్ట్ చేసింది. ప్రపంచ వ్యాప్తంగా రూ. 150 కోట్లకు పైగా గ్రాస్ కలెక్ట్ చేసింది. అటు సూరి, ఇటు సుహాస్... ఇద్దరి కెరీర్‌లలో 'మందాడి' బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. 'మండాడి'లోని బోట్ సీక్వెన్స్, రేసింగ్ సన్నివేశాలకు థియేటర్లలో విజిల్స్ పడ్డాయి. ఈ చిత్రానికి కథిర్ విజువల్స్, జీవీ ప్రకాష్ సంగీతం, పీటర్ హెయిన్ - దిలీప్ సుబ్బరాయన్ - మహేష్ మాథ్యూ యాక్షన్ సీక్వెన్స్ హైలెట్‌గా నిలిచాయి. సూపర్ స్టార్ రజనీకాంత్, కమల్ హాసన్ సహా పలువురు తమిళ సెలబ్రిటీలు ఈ సినిమాపై ప్రశంసల జల్లు కురిపించారు. ఈ చిత్రానికి మణికందన్ సహా నిర్మాత.

